Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,వర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com
Published from mahabub nagar సంపుటి :23 సంచిక :95 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 22 జులై 2025 పేజీలు :12 వేల రూ5 /-

## ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు
# వందశాతం లక్ష్యాలను సాధించారు

### ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రపంచం దృష్టి మొత్తం మేడిన్ ఇండియా ఆయుధాలపైనే: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**న్యూ డిల్లీ జూలై 21:**బీఆపరేషన్ సిందూర్ తో మన దేశ సైనికుల సత్తా ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఆపరేషన్‌తో మన సైనిక సామర్థ్యం, గొప్పతనం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతోందన్నారు. ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం గురించి మన దేశ ఎంపీలు ప్రపంచంలోని వివిధ దేశాల్లో పర్యటించి వివరించారని మోదీ గుర్తు చేశారు.పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయంగా ఎండగట్టినట్లు చెప్పారు. తుపాకులు, బాంబులు ఉన్నా మన రాజ్యాంగం ముందు నిలబడలేకపోయాయని స్పష్టంచేశారు. ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయంపై వేడుక చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీలూ, ప్రతీ ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి రావడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌లో మన జాతీయ జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం అని కొనియాడారు. ఇక రైతుల జీవనోపాధి, దేశ ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉందన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో
# అప్రమత్తంగా ఉండాలి



### వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులకు సీఎం వార్నింగ్

**హైదరాబాద్, జులై 21**: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదైందన్నారు. ఇది తక్కువ వర్షపాతమని ఆయన పేర్కొన్నారు. అయితే గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. పోలీస్ కమిషనరేట్లల్లోని ఉన్నతాధికారులు గ్రౌండ్ స్థాయిలో ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని వారికి వివరించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం సైతం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఈ కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ప్రతీ రోజు జిల్లా కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని.. సాగునీటికి సంబంధించి వాటర్ మేనేజ్‌మెంట్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిగ అభిప్రాయపడ్డారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. యూరియా స్టాక్‌కు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్టాక్ డిటైల్స్ ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కావాల్సినంత యూరియా స్టాక్ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ ఆధికారులను ఆదేశించారు. రైతుల కంటే ఏదీ ముఖ్యం కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కుండ బద్దలు కొట్టారు.

## ఈడీని ఎందుకు రాజకీయ
# పోరాటలకు ఉపయోగిస్తున్నారు

### ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం



**న్యూ డిల్లీ జూలై 21:**కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో కర్నాటక సీఎం సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతి, రాష్ట్రమతి బైరతి సురేశ్‌లకు జారీ చేసిన సమన్లు కర్నాటక హైకోర్టు రద్దు చేసింది. హైకోర్టు ఆదేశాలను ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పిటిషన్‌ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును విచారించడం ఏమాత్రం ఇష్టం లేదని బెంచ్ స్పష్టం చేసింది. ఈడీని ఎందుకు రాజకీయ పోరాటలకు ఉపయోగిస్తున్నారంటూ ఘాటుగా ప్రశ్నించింది.రాజకీయ యుద్ధాలను ఓటర్ల ముందు జరగనివ్వాలి అని సొలిటర్ జనరల్‌తో సీజేఐ అన్నారు. 'మిస్టర్ రాజు దయచేసి మమ్మల్ని నోరు తెరవమని అడకండి. లేకపోతే మేం ఈడీ గురించి కొన్ని కఠినమైన వ్యాఖ్యలు చేయాల్సి వస్తుంది. దురదృష్టవశాత్తు నాకు మహారాష్ట్రలో కొంత అనుభవం ఉంది. మీరు దేశవ్యాప్తంగా ఈ హింసను కొనసాగించరు. ఓటర్ల ముందు ఈ రాజకీయ యుద్ధాలు జరగనివ్వండి. మిమ్మల్ని (ఈడీ) ఎందుకు.. ఉపయోగిస్తున్నారు? సింగిల్ జడ్జి అనుసరించిన నిర్ణయంలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. విచిత్రమైన వాస్తవాలు, పరిస్థితుల్లో దాన్ని తోసిపుచ్చుతున్నాం' అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## రింగ్ రైలు
# డీపీఆర్ రెడీ

**హైదరాబాద్, జూలై 21:**తెలంగాణలో ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ ఖరారైంది. 392 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ.12,070 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. దక్షిణ మధ్య రైల్వే దీన్ని 8 జిల్లాలు, 14 మండలాల పరిధిలో చేపట్టనుంది, ఇందులో 26 కొత్త రైల్వే స్టేషన్లు ఉంటాయి. ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్ వంతెనలు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి, రవాణా మెరుగుదలకు కీలకం కానుంది.తెలంగాణలో ప్రతిష్టాత్మక ఔటర్ రింగ్ రైలు (హైదరాబాద్ రీజినల్ రింగు రైల్) ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ ఖరారైంది. 392 కిలోమీటర్ల పొడవునా సాగే ఈ ప్రాజెక్టుకు రూ.12,070 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రాజెక్టును రాష్ట్రంలోని 8 జిల్లాలు, 14 మండలాల పరిధిలో చేపట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మార్గంలో 26 కొత్త రైల్వే స్టేషన్లు రానున్నాయిముందుగా 508 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, గనుల మంత్రి కిషన్‌రెడ్డి సూచనల మేరకు 392 కిలోమీటర్లకు తగ్గించారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు దగ్గరగా ఉండేలా ఈ అలైన్‌మెంట్‌ను ఎంపిక చేశారు. ఆర్ఆర్ఆర్‌కు 3-5 కి.మీ. దూరంలో ఉంటుంది, రెండు చోట్ల మాత్రం 11 కి.మీ. దూరం ఉండనుంది. దూరం తగ్గినా.. అభివృద్ధికి అధిక అవకాశాలున్న ప్రాంతాలకు దగ్గరగా ఈ మార్గం రానుండటం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ 392 కిలోమీటర్ల రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు రైల్వే బోర్డుకు పంపించడానికి సిద్ధమవుతున్నారు.ఈ ప్రాజెక్టులో ఆరు చోట్ల రైల్ ఓవర్ రైల్ వంతెనలు నిర్మించనున్నారు. అంటే పాత రైలు మార్గాలపై కొత్త లైన్‌ను ఎత్తుగా, ఫ్లైఓవర్‌లో నిర్మిస్తారు. ఈ ప్రాంతాలుగా మాసాయిపేట, గుళ్లగూడ, బూర్గుల, వలిగొండ, వంగపల్లి, గజ్వేల్‌లను ప్రతిపాదించారు. ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుతో పరిసర ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుంది. ఈ రింగ్ రైలు మార్గాన్ని దగ్గరలోకి తీసుకురావడంతో రోడ్డు, రైలు మార్గంతో కూడిన రవాణా ఆధారిత అభివృద్ధి జోరందుకుంటుంది. ఈ ప్రాజెక్టుతో ఆయా రైల్వే స్టేషన్ల నుంచి నగరానికి బస్సులు, మెట్రో రైలు వంటి రవాణా సేవలతో మల్టీమోడల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఔటర్ రింగ్ రైలు వెళ్లే జిల్లాలు: మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట.అలైన్‌మెంట్ మార్గం: ఆలేరు, వలిగొండ, గుళ్లగూడ, మాసాయిపేట, గజ్వేల్ మీదుగా ఈ రింగ్ రైలు మార్గం అలైన్‌మెంట్ ఖరారు చేయబడింది.



## ఓటుబ్యాంకు రాజకీయాలే
# కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంగా మారాయి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు
### రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని కలవనివ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లే..
### బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై నిందలు వేయడం అన్యాయం
### బిజెపి తెలంగాణ రాష్ట అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**న్యూ డిల్లీ జూలై 21:**బీఓటుబ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంగా మారాయని,కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు.సోమవారం డిల్లీ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూరాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని కలవనివ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లేనని,..బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై నిందలు వేయడం అన్యాయ మన్నారు.ఒకవైపు పార్లమెంటులో జరుగుతున్న అనేక అంశాలపై చర్చ జరుగుతుంటే.. ప్రధాన ప్రతిపక్ష నాయకుడే గాయబ్ అవుతున్న పరిస్థితి. అటువంటి వారు బిజెపి మీద విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 19 నెలల్లో ఢిల్లీకి మొత్తం 46 సార్లు వెళ్లారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ కీలక నేతలు ఆయనకు ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కాని మన ప్రధాని మోదీ గారు, కేంద్రమంత్రులు మాత్రం అపాయింట్‌మెంట్ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చారు. ఈ బిల్లుకు బిజెపి సంపూర్ణ మద్దతు ఇచ్చింది.కానీ ఆర్డినెన్స్ రాకముందే, అందులో 10% ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కుట్ర చేయడం బాధాకరం. బిజెపి మతపరమైన, రాజకీయపరమైన రిజర్వేషన్లకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుంది.బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలంటే, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అయితే కేబినెట్ లో చర్చ చేసినప్పుడు న్యాయ సలహాలు తీసుకున్నారా లేదా అన్నది అనుమానం కలుగుతోందన్నారు..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి 50 శాతం క్యాప్ మించుతుంది.బీసీ రిజర్వేషన్ శాతం పెంచాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 లో సవరణ చేయాల్సిన బాధ్యత ఉంటుంది.బీసీ రిజర్వేషన్ శాతం పెంచాలంటే, పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285లో సవరణ చేయాల్సిన అవసరం ఉంటుంది.ఇప్పుడు బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని చూస్తోంది. అసలు మీకు 9వ షెడ్యూల్ లో పంపించేటువంటి ప్రక్రియ మీకు తెలుసా? మీకు న్యాయసలహాదారులు చెప్పలేదా? అని ప్రశ్నించారు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని చూస్తోంది. అసలు 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియ కాంగ్రెస్ పార్టీకి తెలుసా? మీ న్యాయ సలహాదారులు ఏమన్నారు?1973లో కేశవనంద భారతీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. 9వ షెడ్యూల్‌లో చేర్చినా, ఆ చట్టం జ్యుడిషియల్ రివ్యూకు లోబడి ఉంటుంది.జయలలిత గారు తమిళనాడులో చేసిన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చినా, అది ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇంకా తుది నిర్ణయం రాలేదు.

## పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు విపక్షాల పట్టు

### సభలో పెద్ద ఎత్తున నినాదాలు..సభ వాయిదా

న్యూ డిల్లీ జూలై 21 పహల్గాం ఉగ్రదాడి ఘటన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ను కుదిపేస్తోంది. ఈ ఘటనపై చర్చించాలంటూ విపక్షాలు లోక్‌సభలో నిరసనకు దిగారు. దీంతో దిగువ సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ ఎంత చెప్పినా సభ్యులు వినకపోవడంతో లోక్‌సభ ను వాయిదా వేయాల్సి వచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశామయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమయ్యాయి. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలంటూ పట్టుబట్టారు. అయితే, ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానాలపై చర్చ చేపడదామని స్పీకర్ ఓంబిర్లా నచ్చజెప్పారు. అయినా ఎంపీలు వినిపించుకోలేదు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# సంపాదకీయం


# ఈ అరకొర నివేదిక దేనికి?!

ఒక పెను విషాదంపై జరిగే దర్యాప్తు ఎంతో బాధ్యతాయుతంగా వుండాలి. ఆ ఉదంతంలో అసలు జరిగిందేమిటో చెప్పే ప్రయత్నం చేసినప్పుడు అస్పష్టతకు తావీయకూడదు. ప్రాథమిక దర్యాప్తుకైనా, పూర్తిస్థాయి దర్యాప్తుకైనా ఇదే వర్తిస్తుంది. కానీ గత నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం విషయమై శుక్రవారం అర్ధరాత్రి వెలువరించిన ప్రాథమిక దర్యాప్తు ఆ నియమాలను ఉల్లంఘించింది. బాధిత కుటుంబాల్లో అయోమయాన్ని మరింత పెంచింది. ఆ ప్రమాదం వైమానిక ప్రమాదాల చరిత్రలో పెద్దది. ఆ విషాద ఘటన సమ యంలో విమానంలో 242 మంది ప్రయాణికులుండగా, ఒకరు క్షేమంగా బయటపడ్డారు. భవంతిపై కూలినందువల్ల అక్కడున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో ఇంధనాన్ని నియంత్రించే స్విచ్‌లు రెండూ ఆపివేసి వుండటం వల్లనే ప్రమాదం జరిగివుండొచ్చని దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక భావించింది. ఇది కేవలం ప్రాథమిక నివేదికే గనుక వెంటనే నిర్ణయానికి రావటం తగదని కేంద్ర వైమానిక మంత్రిత్వ శాఖ అంటున్నది. మంచిదే. అటువంటప్పుడు ఏఏఐబీ నివేదిక స్విచ్‌ల విషయంలో మరింత సమాచారం అందాకే వాటిని ప్రస్తావించి వుండాల్సింది. పైలెట్ల సంఘం కూడా నివేదికను తప్పుబడు తోంది. పైలెట్ల తప్పిదమే కారణమని అర్థం వచ్చేలా నివేదిక వుండటం సరికాదని విమర్శిస్తున్నారు. దర్యాప్తులో తమ ప్రతినిధికి ఇప్పటికైనా చోటీయాలని వారు అంటున్నారు. ఈ అయోమయం ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో వున్న బాధిత కుటుంబాలను మరింత నొప్పించదా? అంతర్జాతీయ వైమానిక నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన ఏడాదిలోగా తుది నివేదిక రావాలి. ఈలోగా విడుదల చేసే ప్రాథమిక నివేదిక పైలెట్లను తప్పుబట్టే విధంగా వుండటం, ఆ తర్వాత దాన్ని ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదనటం న్యాయమేనా? ఘటనా స్థలంలో దొరికిన స్విచ్‌లున్న పరికరంలో అవి రెండూ 'ఆన్' చేసివున్నాయి. కానీ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలెట్ మరొకరితో 'ఇంధనం ఎందుకు నిలిపివేశావ్' అని అడగటం, అందుకు రెండో పైలెట్ 'నేనలా చేయలేదే...' అంటూ జవాబివ్వటం వినబడటాన్నిబట్టి స్విచ్‌లు ఆపివేసి వున్నట్టు దర్యాప్తు బృందం నిర్ధారణకొచ్చింది. కానీ రెండో పైలెట్ ఆ వెంటనే వాటిని సరిచేసి వుండొచ్చని, అందుకే అవి సక్రమంగా వున్న స్థితిలో లభించాయని నివేదిక అంటున్నది. ఈ సంభాషణల్లో అడిగిన వారెవరో, జవాబిచ్చిన వారెవరో దర్యాప్తు చేసినవారు గుర్తించారా? గుర్తించి వుంటే ఆ సంగతి వెల్లడించటానికి వారికున్న అభ్యంతరమేమిటి? ఒకవేళ అలాంటి అభ్యంతరం వున్నప్పుడు అసలు ఆ సంభాషణను బయటపెట్టడం దేనికి? విమానంలోని యాంత్రిక వ్యవస్థలు సంక్లిష్టమైనవి. విమాన గమనంలో మనుషుల జోక్యం దాదాపు అవసరం లేని 'ఫ్లై బై వైర్' వ్యవస్థ అందుబాటులోకొచ్చి దశాబ్దాలవుతోంది. ముఖ్యంగా విమానం టేకాఫ్ సమయంలోనూ, దిగే సమయంలోనూ ఆ వ్యవస్థ పూర్తిగా తనకు తానే అన్నిటినీ సరిచేసుకుంటుంది. పైకెగిరినప్పుడూ, కిందకు దిగినప్పుడూ అవసరమైన ఇంధనం సరఫరా అయ్యేలా చూసుకుంటుంది. ఇవి విఫలమైన పక్షంలో పైలెట్ అవసరమైన మార్పులు చేసుకోవ డానికే స్విచ్‌లుంటాయి. రెండు స్విచ్‌లకూ రెండువైపులా రింగ్‌లుంటాయి. వాటికి ప్రత్యేక లాకింగ్ వ్యవస్థ వుంటుంది. మనిషి ప్రత్యేకించి వాటిని స్విచాన్ చేయటానికైనా, స్విచాఫ్ చేయటానికైనా ముందు ఆ లాకింగ్‌ను తెరవక తప్పదు. రెండు స్విచ్‌లూ ఆగిపోవటానికి మధ్య సెకను వ్యవధి వుందని తేల్చారు. పైగా పైకెగురుతున్న సమయంలో ఎక్కువ ఇంధనం సరఫరా కావాల్సి వుండగా దాన్ని కావాలని ఏ పైలెట్ కూడా స్విచాఫ్ చేయడు. దానిపై దర్యాప్తు బృందం ఏ నిర్ధారణకూ రాలేదు. పైలెట్లుగా వ్యవహరించినవారి చరిత్ర చూసినా ఉద్దేశపూర్వకంగా ఆపివుంటారని ఊహించటం అసాధ్యం. ప్రధాన పైలెట్ సుమీత్ సభర్వాల్‌కు బోయింగ్ 787ను 8,600 గంటలు నడిపిన సర్వీస్ (మొత్తంగా 15,638 గంటల సర్వీస్) వుండగా, కో పైలెట్ క్లైవ్ కుందేర్‌కు బోయింగ్‌పై 1,100 గంటల అనుభవం, మొత్తంగా 3,403 గంటల అనుభవం వుంది. ఇద్దరూ ఈ విమానం నడపటానికి ముందు తగినంత విశ్రాంతి తీసుకున్నవారే. ప్రధాన పైలెట్ పర్యవేక్షణలో కో పైలెట్ ఇష్టానుసారం చేయటం సాధ్యపడదు. ఒకవేళ ఆ ప్రయత్నం జరిగివుంటే వాగ్వాదం చోటుచేసు కునేది. అది రికార్డయ్యేది. పూర్తి స్థాయి పారదర్శకతకు దర్యాప్తు సంస్థ ఎందుకు వెనకాడుతోంది? ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను కేవలం ఒక ప్రశ్న, జవాబు స్థాయికి కుదించటంలోని మర్మమేమిటి? అటు తర్వాత లేదా అంతకుముందు వారేం మాట్లాడుకున్నారు? ఇది చెప్పకపోతే పైలెట్లలో ఒకరు ఆత్మాహుతికి పాల్పడ్డారా అనే సంశయం బయల్దేరుతుంది. ఎయిర్‌లైన్స్ రేటింగ్స్ వెబ్‌సైట్ ప్రధాన సంపాదకుడు జెఫ్రీ థామస్ అడుగుతున్నది ఇదే. దర్యాప్తు ఫలితాల గురించి అంతర్జాతీయంగా అనేకులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే ఈ రకం విమానాలను బ్రిటిష్ ఎయిర్‌వేస్ సంస్థ, వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ప్రధానంగా వినియోగిస్తున్నాయి. ప్రాథమిక నివేదిక విడుదల చేయటం స్వాగతించదగిందే. కానీ ఇప్పటికే వున్న సంశయాలను మరింత పెంచేలా, అస్పష్టత అలుముకునేలా అది వుండటం సరికాదు. పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ పూర్తి పాఠం విడుదల చేస్తే అటు పైలెట్‌ల సంఘం అభ్యంతరాలతోపాటు, ఇటు బాధిత కుటుంబాల సంశయాలు కూడా సమసిపోతాయి.

# నేడు దాశరథి కృష్ణమాచార్య జయంతి

## తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య

దాశరథిగా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో జన్మించాడు. ప్రస్తుతం ఈ గ్రామం ఖమ్మం జిల్లాలో ఉంది. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బిఎ చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. నిరంకుశ నిజాము పాలన గురించి.. ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటి రతనాల వీణ ఎముకల్ మసిచేసి పొలాలు దున్ని భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలంగాణము రైతుదే. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదులోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు.




ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. 1987 నవంబరు 5 న దాశరథి మరణించాడు.

**చిత్ర పరిశ్రమకు దాశరథి ఆగమనం**

'ఇద్దరు మిత్రులు' చిత్రం ద్వారా సుప్రసిద్ధ గేయ రచయిత చిత్రపరిశ్రమకు పరిచయం అయ్యారు. ఆయనే దాశరథి. ఈ పరిచయానికి పూర్వం దాశరథి తాను తెలుగులోకి అనువదించిన గాలీబ్ గేయాలను అక్కినేని నాగేశ్వరరావుకు అంకితం చేశారు. ఆ సభకు బూర్గుల రామకృష్ణారావుగారు అధ్యక్షత వహించారు. ఆ గేయ సంపుటిని మధుసూదనరావు చదివారు. ఆ శైలి ఆయనకు బాగా నచ్చింది. మీరు సినిమాలకు పాటలు వ్రాయకూడదా? అన్నారు మధుసూదనరావు. అందుకు సమాధానంగా "నాకు సంగీత పరిజ్ఞానం లేదు కదా ఎలా?" అన్నారు దాశరథి. "అదంతా మేం చూసుకుంటాం. మీరు వ్రాస్తారా ?" అన్నారు మధుసూదనరావు. ఒ.కె. అన్నారు దాశరథి. ఆ మర్నాడు మద్రాసు ప్రయాణమయ్యారు. తొలిసారిగా సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావుతో మ్యూజిక్ సిట్టింగ్‌లో పాల్గొన్నారు దాశరథి. ట్యూన్‌కు రాస్తారా ? లేక మీరు రాస్తే నేను ట్యూన్ కట్టుకోవాలా? అనడిగారు రాజేశ్వరరావు. ట్యూన్‌కు రాయటమంటే ఏమిటి? ఆశ్చర్యంగా అడిగారు దాశరథి. అంటే 'నేను 'సరిగమలు' వ్రాసి ఇస్తే దాని ప్రకారం మీరు పదాలు వేయటం ఒక పద్ధతి. మీరు వ్రాస్తే దానికి నేను ట్యూన్ కట్టుకోవటం రెండవ పద్ధతి. ఈ రెంటిలో ఏది మీకు ఈజీ చెప్పండి' – అన్నారు రాజేశ్వరరావు. సరే మీరే ట్యూన్ ఇవ్వండి. రాస్తాను. ఛాయిస్ రాజేశ్వరరావు గారికే ఇచ్చారు దాశరథి. ట్యూన్ ఇచ్చి అలా తమలపాకు బిగిద్దామని వెళ్లారు రాజేశ్వరరావు. పది నిముషాల్లో తిరిగి వచ్చేసరికి 'రెడీ' అన్నారు దాశరథి. అప్పుడేనా? అని ఆశ్చర్యపోతూనే హార్మోనియంలో రాగాలాపన చేసి సరిచూసుకున్నారు రాజేశ్వరరావు. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. వెంటనే చరణాలకు ట్యూన్ ఇచ్చి ఇలా పక్కకు వెళ్లి మధుసూదనరావు చెవులో గుసగుసగా చెప్పారు.."అమ్మో ! ఈయన అఖండుడండీ. నేను ఇచ్చింది చాలా కష్టమైన ట్యూన్. పది నిముషాల్లో రాసి పడేసారంటే నమ్మండి" అంటూ తెగ మెచ్చుకున్నారు రాజేశ్వరరావు. ఈ విధంగా దాశరథి కలం నుండి జాలువారిన తొలి సినిమా పాట 'ఖుషీఖుషీగా నవ్వుతూ చెలాకి మాటలు రువ్వుతూ', 'పాడవేల రాధికా' అంటూ సాగింది. "ఖుషీ ఖుషీగా నవ్వుతూ" పాట ట్యూన్ ఒక ఇంగ్లీషు ఆల్బమ్ నుండి తీసుకున్నారు రాజేశ్వరరావు గారు. హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడి 'ఖవ్వాలి' పాటల తీరుతెన్నులు తెలిసిన వారు కావటంతో చిత్రంలోని ఒక ఖవ్వాలి పాటను కూడా ఆయనతో వ్రాయించారు. "నవ్వాలి నవ్వాలి నీ నవ్వులు నాకే ఇవ్వాలి" అన్న ఈ పాట "ఇద్దరు మిత్రులు" చిత్రంలోని తొలి పాట. అలా ఆయన వెండితెరపై గీతాలను శ్రోతలకు రుచి చూపించారు.

## టెక్నాలజీతో నెంబర్ వన్ గా మారిన

# అహ్మదాబాద్ సిటీ

**గాంధీనగర్, జూలై 21:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది. స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆ నగరం అనేక చర్యలు తీసుకుంటోంది. వరదలను నివారించడానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ, రియల్ టైమ్ పర్యవేక్షణ చేస్తోంది. అయితే హైదరాబాద్‌ను మాత్రం వరదల సమస్య పట్టిపీడిస్తోంది. జాతి పిత మహాత్మా గాంధీ పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. పొలిటికల్ ఫ్రీడమ్ కంటే పరిశుభ్రతే ముఖ్యం అని ఆయన చెప్పారు. పారిశుద్ధ్యం లేకుండా కేవలం రాజకీయ శక్తి ఏం చేయలేదని అన్నారు. అయితే మహాత్ముని మాటలే అక్షరాలా పాటిస్తూ..దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది గుజరాత్‌లోని అహ్మదాబాద్. పది లక్షల కన్నా జనాభా ఎక్కువ ఉన్న పెద్ద నాగరాల్లోకెల్లా.. క్లీనెస్ట్ సిటీగా నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి.. తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంటూ వస్తోందీ సిటీ. పరిశుభ్రత విషయంలో మేటిగా ఉన్నా.. ఈ నగరాన్ని వరదలు వేధిస్తున్నాయి. ఇప్పుడు ఈ నగరం ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అహ్మదాబాద్ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఎలా అమలు చేస్తున్నారు? వరదల నివారణకు అహ్మదాబాద్ ఏం చేస్తోంది? చిన్న వర్షానికే రోడ్లు నదులుగా మారే హైదరాబాద్.. దాన్నుంచి ఏం నేర్చుకోవచ్చు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 జాబితాలో టాప్‌లో నిలిచిన అహ్మదాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు బహూకరించారు. భోపాల్, లఖ్‌నవూ.. తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఇక ఇండోర్, సూరత్, నవీ ముంబై వంటి సిటీలు సూపర్ స్వచ్ఛ్ లీగ్ గ్రూప్‌లోకి వెళ్లగా.. హైదరాబాద్ ఆరో స్థానంలో నిలిచింది. కంటోన్మెంట్ బోర్డు ర్యాంకుల్లో.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తొలి స్థానంలో నిలిచి రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ లిస్ట్‌లో అహ్మదాబాద్‌కు మొదటి స్థానం ఊరికే రాలేదు. దాని కోసం అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చాలా శ్రమించింది. అనేక చర్యలు చిత్తశుద్ధితో అమలు చేసింది. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రతిరోజు 20 లక్షల గృహాలు, 5 లక్షల కమర్షియల్ ప్రాపర్టీల నుంచి చెత్త సేకరిస్తోంది. ఇందుకోసం జీపీఎస్ ఉన్న 1,850 పైగా వాహనాలు ఉపయోగిస్తోంది. 4800 మంది రాత్రి రోడ్లు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులతో సహా మొత్తం 9000 మంది, 56 మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషీన్లు ప్రతిరోజు 1500 కిలో మీటర్ల రోడ్లను ఊడుస్తున్నాయి. నగరంలో 43,000 పాయింట్లను గుర్తించి.. టార్గెటెడ్ మెయింటేనెన్స్ చేస్తున్నారు. తెలంగాణలో




ఇంతకుముందు చేసినట్లే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. రెడ్యూస్, రీ-యూజ్, రీసైకిల్ అనే %===% సూత్రాల ఆధారంగా చెత్త నిర్వహణ చేస్తున్నారు. నగర సాలిడ్ వేస్ట్‌ను 100 శాతం ప్రాసెస్ చేస్తున్నారు. 'మై థైలీ' (పాత దుస్తుల నుంచి క్యారీ బ్యాగ్‌లు తయారు చేయడం) వంటి వాటిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు. రెగ్యులర్‌గా మెయింటేన్ చేసే పబ్లిక్ టాయిలెట్లను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 250 పైగా టాయిలెట్లను రెనోవేట్ చేశారు. మహిళల కోసం పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ, పైపులైన్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేశారు. వేస్ట్ టూ ఆర్ట్ అనే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పిరానా డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన 12.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చెత్తను మొత్తం ప్రాసెస్ చేశారు. బయోరీమీడియేషన్ పద్ధతిలో తొలగించి.. దాన్ని రెఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయెల్ - రీసైకిల్ చేయలేని సాలిడ్ వేస్ట్‌ను ప్రాసెస్ చేస్తే వచ్చే ఇంధనం), ఇనర్ట్ మెటీరియల్‌గా (సాధారణ పరిస్థితుల్లో ఇతర పదార్థాలతో రియాక్షన్ కానివి, మట్టిలో అంత త్వరగా కలిసిపోనివి) మార్చారు. రోజుకు 1,000 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్.. 15 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇక పొడి చెత్తను నిర్వహించేందుకు 9 మెటీరియల్ రికవరీ ప్లాంట్లను మహిళను ఆపరేట్ చేస్తున్నారు. నగరంలోని గోడలపై అందమైన కళారూపాలను వేస్తున్నారు. అలాగే చారిత్రక వారసత్వ కట్టడాలు, ప్రాంతాల వద్ద, పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపడుతున్నారు. పరిశుభ్రత నిబంధనలు పాటించని వారికి జరిమానాలతో బుద్ధి చెబుతోంది అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఇప్పటివరకు ఫైన్ల రూపంలో రూ.12 కోట్లు వసూలు చేసిందంటేనే.. ఎంత పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తోందో తెలుసుకోవచ్చు. చెత్త నిర్వహణ సమర్థంగా చేయడానికి ఏఎంసీ టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. చెత్త కుండీలు, చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ట్యాగ్‌లు జతచేశారు. దీని ద్వారా వేస్ట్ కలెక్షన్ రూట్లు, వాహనాల కదలికలు, చెత్త నిర్వహణ సమర్థతను.. సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షిస్తున్నారు. ఇక చెత్త సేకరణ, ట్రాన్స్‌పోర్టేషన్‌ను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లకు సరైన సమయంలో ఏఎంసీ పేమెంట్లు చేస్తోందని తెలుస్తోంది. దానివల్ల జవాబుదారీ తనం ఉంటోందని సమాచారం. ప్రజల ఫిర్యాదులను కూడా ట్రాక్ చేసి, పరిష్కరిస్తున్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో వరదల నిర్వహణను కూడా పరోక్షంగా పరిగణలోకి తీసుకుంటారు. అర్బన్ వాటర్, సానిటేషన్ మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేవా అని కూడా లెక్కిస్తారు. అయితే వరదలను నియంత్రించడంలో అహ్మదాబాద్ కూడా చాలా సవాళ్లు ఎదుర్కొంటోంది. నగరంలో మూడింట్లో ఒకవంతు మాత్రమే డ్రైనేజీ నెట్వర్క్ ఉంది. కానీ, హైదరాబాద్‌తో పోలిస్తే అహ్మదాబాద్ మెరుగైన చర్యలు తీసుకుంటోంది. ఆ 14 గ్రామాల్లో ఇద్దరు సర్పంచ్‌లు, రెండు రాష్ట్రాల స్కీమ్‌లు.. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య పంచాయితీ తెగేదెలా? ప్రజల కోరిక ఏంటి? వరదలను అంచనా వేయడానికి 25 ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌లను అహ్మదాబాద్ మోహరించింది. 19 కంట్రోల్ రూమ్‌లు, 2500 సీసీటీవీ కెమెరాలతో రియల్‌టైమ్ పర్యవేక్షణ, ప్రతిస్పందనలను చూసుకుంటోంది. నగరవ్యాప్తంగా ఇంకుడు గుంతలను నిర్మిస్తోంది. దీనివల్ల వరద రిస్క్ తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ఇక లొకేషన్ స్పెసిఫిక్ వరద నిర్వహణ మోడల్స్ అభివృద్ధి చేయడానికి ఐఐటీ గాంధీనగర్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మరోవైపు, హైదరాబాద్‌లోనూ వరద సమస్య తీవ్రంగా ఉంది. చిన్న వర్షం పడితేనే రోడ్లు జలమయం అవుతున్నాయి. గచ్చిబౌలి లాంటి ప్రాంతాల్లో కూడా రోడ్లు నదుల్లా మారాయి. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురవడం, సరైన డ్రైనేజీ నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. చిన్న వర్షానికే రోడ్లపై పొంగిపొర్లే డ్రైనేజీలు చూస్తే.. సిటీ డ్రైనేజీ వ్యవస్థ ఏ తీరున ఉందో చెబుతోంది. రోడ్లే కాదు, ఆఖరికి ఫ్లైఓవర్లు కూడా నదుల్ని తలపిస్తున్నాయంటే.. వరద నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న అర్బన్ ప్రాంతాలు పరిశుభ్రతతో పాటు వరద నిర్వహణపై కూడా శ్రద్ధ పెట్టాలి. ఇక దాదాపు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన అహ్మదాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలు మరింత దృష్టి సారించాలి. పరిశుభ్రత, వరద నిర్వహణ వంటి విషయాల్లో అహ్మదాబాద్, సూరత్, ఇండోర్ వంటి నగరాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసి.. వాటిని హైదరాబాద్‌కు ఉపయోగపడేలా మలచుకోవాలి. అప్పుడే సుందర, సురక్షిత భాగ్యనగరం సాకారం అవుతుంది.

# ఈటెల పార్టీపై చర్చ షురూ...

హైదరాబాద్, జూలై 21:పేరు ప్రస్తావించకుండా భారతీయ జనతా పార్టీలో కీలక నాయకుడి మీద తీవ్రస్థాయిలో మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇంతకీ ఏ నాయకుడిని ఉద్దేశించి ఆయన ఆ మాటలు మాట్లాడారు? శాంతంగా ఉండే ఆయన ఎందుకు ఒక్కసారిగా ఈ స్థాయిలో స్పందించారు? నిదానంగా మాట్లాడే ఆయన ఎందుకు ఈ రేంజ్ లో మండిపడ్డారు? అనే ప్రశ్నలకు సమాధానాలను రాజకీయ విశ్లేషకులు రకరకాలుగా చెబుతున్నారు.కమలం పార్టీ నుంచి బయటికి వెళ్లడానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు సిద్ధంగా ఉన్నారని.. ఇటీవల పార్టీ అధ్యక్ష పీఠాన్ని ఆయన అధిరోహించాలని అనుకున్నారని.. చివరి నిమిషంలో అది తప్పిపోయిందని.. అందువల్లే తన రాజకీయ ప్రస్థానాన్ని మార్చుకోవాలని అనుకుంటున్నారని ఆ పత్రిక తన కథనంలో పేర్కొంది. కొత్త రాజకీయ వేదికన ఏర్పాటు చేసేందుకు ఈటెల వేగంగా అడుగులు వేస్తున్నారని.. ఆయన సన్నిహితులు బహుజన జనతా సమితి పేరుతో ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేశారని ఆ పత్రిక వివరించింది. అందువల్లే ఆయన ప్రతి వార్డ్ మెంబర్ మనవాళ్లే అంటూ సందేశం ఇచ్చినట్టు తెలుస్తోందని ఆ పత్రిక రాసిన కథనంలో స్పష్టం చేసింది. పార్టీ పెట్టాలంటూ అభిమానులు తీసుకొస్తున్నారని..



అందువల్లే ఈటెల ఫైర్ బ్రాండ్ లాగా మాట్లాడారని ఆ పత్రిక విశ్లేషించింది.." లాభనష్టాలు.. సాధ్యా సాధ్యాలను పరిశీలించిన తర్వాత.. అందరిని కలుపుకొని పోయే విధంగా ప్రణాళిక రూపొందించి.. ఈటల పార్టీ పేరును ప్రకటిస్తారని" ఆ పత్రిక తన కథనంలో వెల్లడించింది.." భారతీయ జనతా పార్టీ అధిష్టానానికి అన్ని వివరించిన తర్వాతే కీలక ప్రకటన చేస్తారు. కొత్త పార్టీ విషయం బయటకి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బిజెపిలో రాష్ట్రస్థాయి నేతలు కొట్టుకుంటున్నారు. అందువల్లే ఈనెల చివరిలో తాడోపేడో తేల్చుకోవడానికి ఎంపీ వర్గం సిద్ధమైందని" ఆ పత్రిక తన కథనంలో వివరించింది.వాస్తవానికి ఈటల రాజేందర్ ది పీడీఎస్ యూ నేపథ్యం. పైగా ఆయన వామపక్ష భావజాలం కలిగిన నాయకుడు. అందువల్లే ఆయన మాటలో సూటితనం కనిపిస్తుంది. భారత రాష్ట్ర సమితిలో కొనసాగినప్పుడు.. అంతకుముందు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు.. ఈటల రాజేందర్ నిక్కచ్చిగా వ్యవహరించేవారు. అందువల్లే ఆయన గులాబీ పార్టీకి ఓనర్లం అని వ్యాఖ్యానించారు. అదే ఆయనను ఆ పార్టీ నుంచి బయటికి వెళ్లేలా చేసిందని సన్నిహితులు అంటుంటారు. నాడు తన రాజకీయ గమనానికి సంబంధించి అనివార్య పరిస్థితుల్లో ఈటెల రాజేందర్ భారతీయ జనతా పార్టీలోకి వెళ్లారని.. అంతే తప్ప పార్టీ సిద్ధాంతాలు నచ్చిన కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. ఏది ఏమైనప్పటికీ పార్టీ ఏర్పాటు చేయాలని.. రాజకీయ కార్య క్షేత్రాన్ని మార్చుకోవాలని ఈటెల అనుకుంటే.. అది తెలంగాణలో మరో పరిణామానికి దారితీస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక పార్టీని నడపడం అంత సులభం కాదని.. గతంలో పార్టీలు ఏర్పాటు చేసిన వారు ఎలాంటి అనుభవాలు ఎదుర్కొన్నారో ఈటలకు తెలుసని.. అందువల్లే ఆయన కొత్త పార్టీ పెట్టే ధైర్యాన్ని చేయకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఉచిత పథకాలపై
# నియంత్రణ రావాలి

### మండలి ఛైర్మన్ గుత్తా



నల్లగొండ::శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేసారు. ప్రస్తుత రాజకీయాల్లో నాయకులు మాట్లాడే భాషపై.. ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇప్పటికే ప్రజల్లో ఈసడింపు ఉంది.. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా మసలుకోండి. వ్యక్తులు కాదు.. వ్యవస్థలు ముఖ్యమన్నారు.దేశంలో పలు రాష్ట్రాల్లో అవినీతి పెరుగుతుంది. కేంద్రం, సుప్రీం కోర్టు, ఈసీ . ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాలపై నియంత్రణ తీసుకురావాలి. ఉచితాలతో ప్రభుత్వాలపై అదనపు భారం పడుతుందని అన్నారుఉ.ఉచితాలతో.. తెలంగాణ ప్రజలు కష్టపడి పనిచేసే తత్వం కోల్పోతున్నారు. బీహార్, ఛత్తీస్ ఘడ్ నుంచి కూలీ పనులకు వస్తున్నారు. ప్రజలు ప్రభుత్వం వైపు చేయి చాపాల్సిన అవసరం ఉండొద్దు.. ఇది మంచి పద్ధతి కాదు. ప్రజలకు పని, ఉపాధి కల్పించడం మీద దృష్టి పెట్టాలి. ఇరిగేషన్ శాఖలో అధికారులు అవినీతి అంతా, ఇంతా కాదు. ఎస్టిమేట్ పెంచి భారీ దోపిడికి పాల్పడుతున్నారు. జయలలిత, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పోయేటప్పుడు ఏమి తీసుకోలేదు. బనకచర్ల కు తెలంగాణ వ్యతిరేకం. కవిత – తీన్మార్ మల్లన్న విషయంలో.. అందరూ సంయమనం పాటించాలి. ప్రజా ప్రతినిధులు విలువలను పాటించాలి.. ప్రజలు ఈసడించుకుంటున్నారని అన్నారు.

## మళ్లీ కేసీఆర్ రావాలని
## ప్రజలు కోరుకుంటున్నారు

### హరీష్ రావు



సిద్ధిపేట:ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేది. కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి అక్కడ చంద్రబాబు వచ్చాక సీన్ రివర్స్ అయింది. ఏపీలో ఎకరా అమ్మితే తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుంది. రేవంత్ కి పాలన చేతకాక తెలంగాణలో ఇలాంటి పరిస్థితి వచ్చింది. మళ్ళీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వీయ అనుభవం చెందారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదు కానీ 2 లక్షల పెన్షన్లు తీసేశారని అనంనారు.కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్ లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ హయాంలో నాట్లకు నాట్లకు రైతు బంధు వచ్చేది. రేవంత్ రెడ్డి హయాంలో ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా వస్తుంది. కాంగ్రెస్ వచ్చాక బోరుబావుల మోటర్ల మెకానిక్ లు మాత్రమే బాగుపడ్డారని అన్నారు.ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేది. కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి అక్కడ చంద్రబాబు వచ్చాక సీన్ రివర్స్ అయింది. ఏపీలో ఎకరా అమ్మితే తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుంది. రేవంత్ కి పాలన చేతకాక తెలంగాణలో ఇలాంటి పరిస్థితి వచ్చింది. మళ్ళీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.గజ్వేల్ లో కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు. గజ్వేల్ లో అన్ని మండలాల్లో గులాబీ జెండా ఎగరాలి. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్. స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టింది. నాయకులు ఎవరు గ్రూపుల జోలికిపోవొద్దు. రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎవరు పోటీలో ఉంటారనేది చర్చించి నిర్ణయం తీసుకుందామని అన్నారు.

## రేవంత్ కామెంట్స్ పై
# గుర్రు.. గుర్రు

హైదరాబాద్, జూలై 21:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామెంట్స్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకంగా కలకలం రేపుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ పదేళ్ల వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా తానే పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానంటూ చెప్పడంపై కాంగ్రెస్ లో విభిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు బయటపడుతుండగా, మరికొందరు మాత్రం లోలోపల ఈ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో ముఖ్యమంత్రి ఎవరు అన్నది నిర్ణయించాల్సింది హైకమాండ్ మాత్రమే. హైకమాండ్ నిర్ణయం మేరకే ఎమ్మెల్యేలు ఎన్నికలు జరిగిన తర్వాత శాసనసభ పక్ష నేతగా ఎన్నుకుంటారు. కాని అందుకు విరుద్ధంగా మాట్లాడటం కొందరు తప్పుపడుతుండగా, ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు మాట్లాడటంలో తప్పేమిటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే తాను మాత్రం పదేళ్ల కాలం పాటు ముఖ్యమంత్రిగా ఉంటానంటూ రేవంత్ రెడ్డి చెప్పడాన్ని కొందరు తీవ్రంగా తప్పుపడుతున్నారు. సీనియర్ నేతలు కూడా ఈ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. బయటపడింది కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాత్రమే కావచ్చు. రాజగోపాల్ రెడ్డి అంటే ఒకింత అసంతృప్తిగా ఉన్నారు. నిజానికి రేవంత్ రెడ్డి కేబినెట్ లోనూ మంత్రులు కొందరు ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడి చివరకు అధిష్టానం నిర్ణయంతో మంత్రులుగా మారారు. గతంలో పీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారు కొందరయితే...



సామాజికవర్గం కోణంలోనూ మరికొందరు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ లో ముఖ్యమంత్రి పదవి అదృష్టం కొద్దీ వరిస్తుంది. అంతే తప్ప అది శాశ్వతం అని భావించకూడదని సీనియర్ నేతలు కూడా చెబుతున్నారు. సీఎంలను మార్చే సంప్రదాయం... గతంలో ఇలా తామే ముఖ్యమంత్రి అనుకున్న వారు సయితం కనీసం మంత్రి పదవిని కూడా దక్కించుకోలేకపోయారన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి తనపై తనకున్న విశ్వాసంతో ఆ మాట అని ఉండవచ్చు. ఇటీవల కాలంలో రాహుల్ జమానాలో ముఖ్యమంత్రులను అంతతేలిగ్గా మార్చే సంప్రదాయానికి కాంగ్రెస్ తెరదించింది. గతంలో మాదిరిగా సీఎంలను వెంట వెంటనే మార్చే సంస్కృతి లేదు. కర్ణాటకలో సిద్ధరామయ్యను చూసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండవచ్చు అన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. డీకే శివకుమార్ వంటి బలమైన నేత పోటీపడినా చివరకు సిద్ధరామయ్యనే కర్ణాటక సీఎంగా మరోసారి కొనసాగించడాన్ని రేవంత్ సన్నిహితులు గుర్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అత్యధికంగా ఉన్నారు. ఇటీవల కాలంలో బీసీ ముఖ్యమంత్రి అంటూ నినాదం ఎక్కువయింది. గత ఎన్నికల్లోనే బీజేపీ బీసీ సీఎం నినాదాన్ని అందుకుంది. అయితే తెలంగాణలో రెడ్ల సామాజికవర్గం పెత్తనంతో పాటు పార్టీని గెలిపించే సత్తాతో పాటు అధికారాన్ని తెచ్చిపెట్టే వర్గంగా ముద్రపడింది. అందుకే రేవంత్ రెడ్డి తరుపున నేతలు ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని? ప్రత్యర్థులను బలంగా ఎదుర్కొనడంలోనూ, వారికి ధీటుగా కౌంటర్లు ఇవ్వడంలో ముందుండే రేవంత్ నాయకత్వం వల్లనే పార్టీ అధికారంలోకి వచ్చిందంటున్నారు. అదే సమయంలో అంత మాత్రాన జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకునే ప్రయత్నం చేయడమేంటని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహా రాజకీయాలు చేయాలని రేవంత్ ఈ రకమైన కామెంట్స్ చేస్తున్నారని కూడా మరికొందరు అంటున్నారు. మొత్తం మీద రేవంత్ తాజా వ్యాఖ్యలను పార్టీలో కొందరు నేతలు హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది.

## మూడు పార్టీలు..
# అంతర్గత పోరు

హైదరాబాద్, జూలై 21:తెలంగాణలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో అసమ్మతి రాగాలు సెగలు రేపుతున్నాయి. ఈ మూడు పార్టీల్లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు అంతర్గతంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. బీఆర్ఎస్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ కార్యక్రమాలతో కాక పుట్టిస్తుండగా, బీజేపీలో ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ వాడివేడి వ్యాఖ్యలు కమలం పార్టీని కుదిపేస్తున్నాయి. ఇక అధికార కాంగ్రెస్ లో భువనగిరి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన కామెంట్స్ హస్తం పార్టీలో దుమారాన్నే లేపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ అంతర్గత సమస్యలను పరిష్కరించకపోతే ఈ మూడు పార్టీలకు ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కల్వకుంట్ల కవిత రాసిన లేఖ విడుదల కావడం, ఆ తర్వాత పార్టీలో "దయ్యాలున్నాయని" వ్యాఖ్యలు చేయడం నుంచి తెలంగాణ జాగృతి జెండా, ఎజెండా వరకు గులాబీ పార్టీలో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. ఏకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనే కవిత నేరుగా అసమ్మతి అస్త్రం సంధించడం విశేషం. ఇప్పటివరకు దీనిపై పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ గాని, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గాని ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. ఇలాగే కవిత తన సొంత ఎజెండాతో పని చేసుకుంటూ పోతే చర్యలు తప్పవన్న చర్చ పార్టీలో సాగుతోంది. ఏది ఏమైనా ప్రతిపక్షంగా బలపడాల్సిన తరుణంలో ఎమ్మెల్సీ కవిత చేస్తోన్న వ్యాఖ్యలు, రాజకీయంగా వేస్తున్న అడుగులు ఆ పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పార్టీ ముఖ్యులు అంతర్గతంగా మదనపడుతున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణే తాను చేపడుతున్నట్లు కవిత చెబుతున్నారు..తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ఉండి, చివరిలో తప్పిపోయినప్పటి నుండి ఎంపీ ఈటల రాజేందర్ రాజకీయంగా కొంత మౌనంగా ఉన్నారు. అయితే ఇటీవలే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఆయన చేసిన కామెంట్స్‌పై బీజేపీలో రచ్చ రచ్చే నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి "ఏటీఎంగా మారిందని" ప్రధాని మోదీ గతంలో వ్యాఖ్యలు చేశారు. అయితే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ, "కాళేశ్వరం ప్రాజెక్టు క్యాబినెట్ అనుమతితోనే నిర్మించారు, నేను ఆర్థిక మంత్రిగా నిధుల విషయంలో మాత్రమే జోక్యం చేసుకున్నాను" అని చెప్పారు."కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు మేలు చేసేదే, కానీ ఇందులో అవినీతి జరిగింది" అని కూడా చెప్పారు. అయితే ఇది ప్రధాని మోదీ వ్యాఖ్యలకు భిన్నంగా ఉందన్నది బీజేపీలోని కొందరి వాదన. దీనిపై వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "తాము మాట మార్చేందుకు ఊసరవెల్లులం కాదని, ప్రధాని మోదీ అభిప్రాయమే పార్టీ అభిప్రాయమని" కుండబద్దలు కొట్టారు. ఇలా ఈ అంశం ఇరువురి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. అధ్యక్ష పదవిని ఆశించినా హైకమాండ్ నుండి అతనికి గ్రీన్ సిగ్నల్ దక్కలేదు. ఆ పదవిని రాంచందర్ రావు ఎగురేసుకుపోయారు. అప్పటి నుండి ఈటలకు ప్రాధాన్యత ఉందన్న వాదన బీజేపీలో ఉంది. ఈ క్రమంలోనే ఈటల పార్టీలోని అసంతృప్తి నేతలతో మంతనాలు జరుపుతున్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈరోజు శామీర్‌పేటలోని తన నివాసంలో చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి: "నీ చరిత్ర ఏంటో, నా చరిత్ర ఏంటో మొత్తం పైకి పంపిస్తా... నా చరిత్ర తెలియదు నా.....కొ...కా""2019లో మోదీ ప్రభంజనం ఉన్నా నేను గెలిచా. టీఆర్ఎస్‌కు 53 వేల మెజార్టీ వచ్చింది. నీకు మెజార్టీయే రాలేదు."""నేను ఎవరికీ భయపడేది లేదు. నాపై జరిగే కుట్రలను ఎదుర్కొంటా."""కడుపులో కత్తులు పెట్టుకునే వారు పార్టీలో ఉంటారు. వారితో యుద్ధం చేయడం కష్టం కానీ ఎదురెళ్లి నిలబడాల్సిందే."""నేను ఏ పార్టీలో ఉన్నా ప్రజల మధ్యే ఉంటా, నా బలం ప్రజాదరణ. పార్టీ కాదు, ప్రజలే."ఈ వ్యాఖ్యలన్నీ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి మాట్లాడినవే అన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ఇటీవలే ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేయడం ఆ పార్టీలోని విభేదాలను ఆవిష్కరిస్తే, ఎంపీ ఈటల రాజేందర్ ఈరోజుటి వ్యాఖ్యలు పార్టీలోని అంతర్గత విభేదాలు తారాస్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.బీఆర్ఎస్, బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఇలా ఉంటే, అధికార పార్టీ కాంగ్రెస్ కూడా ఇందుకు మినహాయింపు కాదని ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తేల్చి చెబుతున్నాయి. "పదేళ్లు నేనే సీఎం ఉంటా" అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. సీఎం పదవిని పార్టీలో "ఎవరూ శాశ్వతంగా రాయించుకోలేరని", పార్టీలో "అందరి సమిష్టి నిర్ణయమని" సీఎం రేవంత్ రెడ్డిపై కౌంటర్ అటాక్ చేశారు. ఇది "పార్టీ విధానాలకు వ్యతిరేకం" అన్నారు. పార్టీని "సామ్రాజ్యంలా భావిస్తే, పార్టీ నేతలు, కార్యకర్తలు సహించరని" చెప్పారు.పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు "ప్రజాస్వామ్య పద్ధతిలో సీఎం ఎన్నిక ఉంటుందని" చెప్పారు. అంతే కాకుండా సీఎం పదవికి "తాను రేసులో ఉన్నానని", మంత్రి పదవి కూడా దక్కకపోవడం పట్ల "తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు" రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు నేరుగా సీఎంను ఉద్దేశించినవే కావడంతో అధికార పార్టీలోనూ అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉందని అర్థమవుతోంది., బీజేపీలో ఉన్నట్లే కాంగ్రెస్, బీఆర్ఎస్ లోనూ అసమ్మతి వర్గం తయారవుతోందని తెలుస్తోంది. అయితే రానున్న రోజుల్లో ఈ మూడు పార్టీలు అసమ్మతి రాగాలను ఆపేలా ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఈ అసమ్మతి నేతలు సైతం పార్టీలో "ఉంటారా, వేరు కుంపటి పెడతారా" అన్న చర్చ నడుస్తోంది.

## క్లాట్ డేట్
# వచ్చేసింది

హైదరాబాద్, జూలై 21:దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ న్యాయ యూనివర్సిటీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్( , పోస్టు గ్రాడ్యుయేట్ లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2026 ప్రవేశ పరీక్ష తేదీ విడుదలైంది. ఈ పరీక్ష షెడ్యూల్‌ను తాజాగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం 24 నేషనల్ లా వర్సిటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తాజా షెడ్యూల్ ప్రకారం క్లాట్ 2025 పరీక్ష డిసెంబర్ 7వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆగస్టు 1 నుంచి ప్రారంభంకానున్నాయి. దరఖాస్తులకు చివరి తేదీగా అక్టోబరు 31ని నిర్ణయించారు.కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ, ఏడాది ఎల్‌ఎల్‌ఎం (యూజీ, పీజీ, డిగ్రీ) ప్రోగ్రాముల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కీలక అప్‌డేట్ జారీ చేసింది. వెబ్ ఆప్షన్లు నమోదుకు తుది గడువును పెంపొందిస్తూ ప్రకటన జారీ చేసింది. తాజా ప్రకటన మేరకు తుది గడువు జులై 25 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వ్యవసాయ కాలేజీలోనూ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు పొందేందుకు వెబ్ ఆప్షన్లలో అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని అన్నారు. ఇతర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని తెలిపారు.

వార్తాతరంగాలు

మంగళవారం 22 జూలై 2025

# తుంగతుర్తి కాంగ్రెస్ లో కీచులాటలు



**నల్గొండ, జూలై 21:**ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరుకు పెట్టింది పేరు. ఇది కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సొంత నియోజకవర్గం. 2009 వరకు ఈ సెగ్మెంట్ జనరల్ క్యాటగిరి కింద ఉండటంతో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఇక్కడ నుంచి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు. 2009 తర్వాత ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారడంతో..ఆయన సూర్యాపేటకు షిఫ్ట్ అయ్యారు. అయినా తన సొంత సెగ్మెంట్ తుంగుతుర్తి పాలిటిక్స్ తన కనుసన్నుల్లోనే జరిగేలా చూసుకుంటారు దామోదర్ రెడ్డిఇప్పటికీ తుంగతుర్తిలో దామోదర్ రెడ్డికి బలమైన అనుచరవర్గం ఉంది. అందుకే అక్కడ ఎవరు పోటీ చేయాలన్నా.. దామోదర్ రెడ్డి మద్దతు ఉండాల్సిందే. అయితే గతంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఉన్న అద్దంకి దయాకర్, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మందుల సామేల్..దామోదర్ రెడ్డి వర్గాన్ని పక్కనపెట్టి పనిచేయాలని ప్రయత్నిస్తుండటంతో గ్రూప్ వార్ రచ్చకెక్కుతోంది. దీంతో నియోజకవర్గంలో ఏ కార్యక్రమం జరిగినా.. ఆధిపత్యపోరు..పరస్పరం దాడులతో ఇష్యూ అవుతోంది.రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవం కోసం సీఎం రేవంత్ రెడ్డి తాజాగా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశాయి పార్టీ శ్రేణులు. అయితే సీఎంకు స్వాగతం పలుకుతూ మాజీ మంత్రి దామోదర్ రెడ్డి వర్గం పెట్టిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపేశారు.ఎమ్మెల్యే తనయుడే ఫ్లెక్సీలను చింపేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక గతంలోనూ పలు కాంట్రవర్సీల్లో మందుల సామేల్ పేరు ప్రచారం జరిగింది. కమిషన్ ఇవ్వాలంటూ లిక్కర్ వ్యాపారులతో ఆయన మాట్లాడినట్లు బయటికొచ్చిన వీడియోతో విమర్శలు ఎదుర్కొన్నారు ఎమ్మెల్యే. ఇక సొంత పార్టీ నేతలతో వైరం ఉండే ఉంది. ఈ అంశాలన్నీ సీఎం దృష్టికి వెళ్లడంతోనే..తిరుమలగిరి సభా వేదికగానే..పద్ధతి మార్చుకోవాలని డైరెక్ట్‌గా స్థానిక ఎమ్మెల్యేకు చురకలు అంటించారు రేవంత్.అసంతృప్తిగా ఉన్నవాళ్లను కూడా కలుపుకొని పోవాలని వేదిక మీదే చెప్పారు సీఎం రేవంత్. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు అంతా ఒక్కటై గెలిపించారు..ఇప్పుడు వాళ్లను నువ్వు గెలిపించాలంటూ..తుంగతుర్తి ఎమ్మెల్యేపై చేయి వేసి మరీ మాట్లాడారు ముఖ్యమంత్రి. రేవంత్ మాటలను బట్టి చూస్తే..వ్యవహార శైలి మార్చుకోవాలని ఎమ్మెల్యేకి చెప్పినట్టేనన్న చర్చ జరుగుతోంది. అయితే ఎమ్మెల్యే సామేల్ అందర్నీ కలుపుకొని పోవడం లేదని..పాతవారిని పక్కనపెట్టి కొత్తవారిని ప్రోత్సహిస్తున్నారని లోకల్ లీడర్లు ఆరోపిస్తున్నారు.పాత కాంగ్రెస్ నేతలకు, కొత్త క్యాడర్‌కు గ్యాప్ ఉందన్న ప్రచారం జరుగుతోంది. వీటన్నింటిని ఇంటెలిజెన్స్ వర్గాలు ఎప్పటికప్పుడు సీఎంకు నివేదిస్తూనే ఉన్నాయట. దీంతో ఆయన కూడా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై దృష్టి పెట్టారని.. అందులో భాగంగానే సభాముఖంగా అందరికీ విషయం అర్థం అయ్యేట్టు చెప్పారన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా ఆధిపత్య పోరు సమసిపోతుందా లేక ఎవరికీ వారే అన్నట్లు నడుచుకుంటారా అనేది వేచి చూడాలి.

# మోగనున్న పెళ్లి బాజాలు.. పెళ్లికి మంచి ముహూర్తాలు ఇవే..



ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది. మళ్లీ తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. జులై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, సెప్టెంబర్ 24, 26, 27, 28, అక్టోబర్ 1 ,2 ,3 ,4 ,8, 10, 11, 12, 22, 24, 29, 30, 31, నవంబర్ 1 ,2 ,7 ,8, 12, 13, 15, 22, 23, 26, 27, 29, 30 తేదీల్లో పెళ్లికి ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. భాద్రపద మాసం-21- సెప్టెంబర్ 21 వరకు ముహూర్తాలు లేవు. ఆగస్టు, సెప్టెంబర్ ,అక్టోబర్, నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఇప్పటికే ఆగస్టు రెండో తేదీ నుంచి పెళ్లిళ్లు భారీగా మొదలు కాబోతున్నాయి. ఆషాడ మాసంలోనే పెళ్లిళ్లకు సంబంధించి బంగారం అంగల్లలో బంగారు కొనుగోలు భారీగా జరిగాయి. కిరాణా షాపులు కూడా కితకితలు కోసం వారు తహతహలాడుతూ ముందడుగు వేస్తున్నారనటంలో ఎటువంటి సందేహం లేదు.

# రాష్టంలోనే మోడల్ మార్కెటింగ్ గా ఖమ్మం వ్యవసాయ మార్కెట్

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్ జూలై 21 :**రాష్ట్రంలోనే మోడల్ మార్కెటింగ్ గా తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రూ.150 కోట్లతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. మార్కెట్ చుట్టూ 6 గేట్లు ఏర్పాటు చేయాలని తుమ్మల అధికారులకు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ లో అన్ని వసతులూ ఏర్పాటు చేస్తున్నామని, సంక్రాంతి నాటికి మార్కెట్ పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. మార్కెట్ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇస్తామని, మార్కెట్ చుట్టూ ఆహ్లాదకరమైన పరిస్థితి ఉండేలా చూస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# అరుణాచలం కు ఆర్టీసీ బస్సు

జయశంకర్



**భూపాలపల్లి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజానికానికి ఒక శుభవార్త... ఈ నెల 28 జూలై రోజున కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కాంచీపురం, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రత్యేక బస్సు నడిపించబడుతుందని డిపో మేనేజర్ ఇందు తెలిపారు. ఈ టూర్ ప్యాకేజ్ టికెట్ ధర ఒక్కరికి 5300 రూపాయలు. ప్రయాణం చేయాలనుకునేవారు సీటు బుకింగ్ కోసం ఈ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు: 9701967519, 8801778959 మరియు వచ్చే నెలలో కూడా వారానికి ఒకటి చొప్పున టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విజయవాడ, అన్నవరం , భద్రాచలం, పంచారామాలు, షిరిడి వంటి ప్రముఖ యాత్ర స్థలాలు ఉండనున్నాయి. 30 మంది ప్రయాణికులు ఉండినచో వారి కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ ఇంధు తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఇందు కోరారు.

# ఏ నోటు తయారీకి ఎంత ఖర్చో తెలుసా?



**హైదరాబాద్:**కరెన్సీ అనేది రాక ముందు వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉండేదనే సంగతి తెలిసిందే. అంటే ఒక వస్తువుకి బదులు మరొక వస్తువును ప్రత్యక్షంగా మార్పిడి చేసుకునే పద్ధతి అన్నమాట.దీన్నే వస్తు వినిమయ పద్ధతి అని కూడా అంటారు. అనంతరం కాలంలో ద్రవ్య వినిమయం అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో క్రీ.శ. 9వ శతాబ్దంలో తొలిసారిగా ద్రవ్య వినియోగం అమల్లోకి వచ్చిందని చెబుతారు.ఈ క్రమంలో భారత్ లో కాగితపు ద్రవ్యాన్ని వాడటం 19వ శతాబ్దంలో మొదలైంది. ఇందులో భాగంగా. 1935 ఏప్రిల్ 1న ఏర్పడిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బీఐ, 1938 నుంచి కరెన్సీ నోట్లను జారీ చేస్తోంది. నాడు ఒక రూపాయి నోటు నుంచి రూ.2000 ఇప్పుడు రద్దయ్యింది, నోటును భారత్ తయారు చేసింది. ఈ నేపథ్యంలో ఏ నోటు ప్రింట్ చేయడానికి ఎంత ఖర్చవుతుందో చూద్దామ్:

రూ.500 నోటు ముద్రణ ఖర్చు రూ.2.94
రూ.200 నోటు ముద్రణ ఖర్చు రూ.2.93
రూ.100 నోటు ముద్రణ ఖర్చు రూ.1.77
రూ.50 నోటు ముద్రణ ఖర్చు రూ.1.13
రూ.20 నోటు ముద్రణ ఖర్చు రూ.0.95
రూ.10 నోటు ముద్రణ ఖర్చు రూ.0.96

రూ.2000 నోటు ముద్రణ ఖర్చు రూ.3.54 రద్దు చేయబడింది? ఈ క్రమంలో రూ.500 నోటుపై ఢిల్లీలో 17వ శతాబ్దంలో నిర్మించిన ఎర్రకోట చిత్రాన్ని ముద్రించగా.. రూ.200 నోటుపై మధ్యప్రదేశ్ రాష్టంలోని 2వ శతాబ్దపు నిర్మాణం సాంచి బౌద్ధ స్థూపం, చిత్రాన్ని ముద్రించారు. ఇదే క్రమంలో రూ.100 నోటుపై గుజరాత్ లోని పఠాన్ లో ఉన్న రాణీకి వావ్, చిత్రం ఉంటుంది. దీనిని 11వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.రూ.50 నోటుపై కర్ణాటక రాష్టం హంపిలో 15వ శతాబ్దంలో నిర్మించిన రథం చిత్రాన్ని ముద్రించారు. రూ.20 నోటుపై ఔరంగాబాద్ లోని ఎల్లోరా గుహల చిత్రాన్ని ముద్రించారు. ఇక రూ.10 నోటుపై ఒడిశా రాష్టంలోని 13వ శతాబ్దంలో నిర్మించిన కోణార్క్ సూర్య దేవాలయ రథ చక్రం చిత్రాన్ని ముద్రించారు.

# ఆకాశంలోనే కాదు.. అవినీతిలోనూ... అతివలు



**హైదరాబాద్, జూలై 21:** ఎవరు ఏమైనా అనుకోని.. చేయి తడిపితేనే పని" ఇదే సిద్ధాంతాన్ని ఈ మహిళా అధికారులు పాటించారు. తమ పని చేస్తున్న ప్రభుత్వ శాఖలలో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారు.. వివిధ పనుల నిమిత్తం తమ వద్దకు వచ్చే ప్రజలనుంచి డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టారు. డబ్బులు ఇవ్వని వారి పనులను పక్కన పెట్టారు. తద్వారా భారీగా వెనకేసుకున్నారు. రోజులు మొత్తం ఒకేలా ఉండవు కాబట్టి.. వీరి లంచం వ్యవహారం బయటపడింది. చివరికి తెలంగాణ ఏసీబీ అధికారులు విస్తృతంగా నిర్వహించిన దాడుల్లో వీరి బాగోతం అందరికీ తెలిసిపోయింది.. ఇప్పుడు వారి జీవితం జైలు పాలైంది.సాధారణంగా నేటి కాలంలో ఆడవాళ్లు సాధిస్తున్న విజయాలు మగవాళ్లకు కూడా అసూయ కలిగిస్తున్నాయి. అనేక అడ్డంకులను దాటుకొని.. అనేక కట్టుబాట్లను పక్కనపెట్టి ఆడవాళ్లు గెలుపులను సొంతం చేసుకుంటున్నారు. వివిధ రంగాలలో తమకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటున్నారు.. ఆకాశంలో సగం.. అవకాశాలలో సగం అని నిరూపిస్తున్నారు. అయితే కొంతమంది మహిళ అధికారులు మాత్రం అవినీతిలో పురుష అధికారులతో పోటీపడుతున్నారు. గతంలో అవినీతి నిరోధక శాఖ దాడులు చేసినప్పుడు పురుష అధికారులు మాత్రమే పట్టుబడేవారు. వారు మాత్రమే జైలుకు వెళ్లేవారు. కానీ నేటి కాలంలో పురుషులను మహిళా అధికారులు డామినేట్ చేస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ వెల్లడించిన గణాంకాలు ఇందుకు నిదర్శనం గా నిలుస్తున్నాయి.. సంబంధిత శాఖలో మహిళా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి.. భారీగా లంచాలు వసూలు చేస్తున్నారు. అయితే కొంతమంది అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించడంతో ఈ మహిళ అధికారుల బండారం బయటపడింది.తెలంగాణ రాష్టంలో అవినీతి నిరోధక శాఖ చేసిన దాడుల్లో ఈ ఏడాది ఇప్పటివరకు 18 మంది మహిళ అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు.. వేల నుంచి మొదలు పెడితే లక్షల వరకు లంచాలు తీసుకుంటూ దొరికిపోయారు.. పైగా లంచాలు తీసుకునే విషయంలో వీరు డిమాండ్ చేస్తూ ఉండడం గమనార్హం.. ఇక పురుష అధికారులలో వంద మందికి పైగా ఆఫీసర్లు ఏసీబీ అధికారుల దాడుల్లో పట్టుబడ్డారు.. అయితే మహిళా అధికారులు ఎక్కువగా రెవెన్యూ, ఇరిగేషన్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థల పరిధిలో పని చేసేవారే ఏసీబీ దాడుల్లో పట్టుబడడం విశేషం.."మహిళా అధికారులు ఇటీవల మేము చేస్తున్న దాడుల్లో దొరికిపోతున్నారు.. లంచాలు వసూలు చేసే విషయంలో మహిళా అధికారులు ఏమాత్రం తగ్గడం లేదు. గతంలో మహిళ అధికారుల్లో కొంత భయం ఉండేది.కానీ ఇప్పుడు అది పూర్తిగా మారిపోయింది. పైగా డబ్బులు వసూలు చేసే విషయంలో వారు డిమాండ్ పూర్వక వైఖరి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా అధికారులపై ఫిర్యాదులు పెరిగిపోయాయి..పక్కా ఆధారాలతో రంగంలోకి దిగిన తర్వాత.. ఇటువంటి లంచగొండి అధికారులను పట్టుకుంటున్నాం.. ఆధారాలతో సహా వారిని చట్టం ముందు దోషులుగా నిలబెడుతున్నామని" అవినీతి నిరోధక శాఖ అధికారులు అంటున్నారు.

# వరంగల్ లో ఇంటర్నేషనల్ స్టేడియం



**వరంగల్, జూలై 21:**వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు క్రీడా పాఠశాల, స్టేడియం ఏర్పాటుకు విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం వరంగల్ క్రీడా రంగానికి కొత్త ఊపిరిని పోస్తుందని ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర యువత, క్రీడాకారుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని మరోసారి రుజువైంది. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి.. వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించి.. వెంటనే అధికారులను విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వద్ద ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. రాష్టంలో యువతకు నాణ్యమైన విద్య, క్రీడా ప్రోత్సాహం అందించడంలో సీఎం తీసుకుంటున్న చర్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి ఇప్పటికే అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని.. కొందరు అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా పొందారని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి వివరించారు.ప్రస్తుతం వరంగల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మాత్రమే ఉందని.. అయితే అది పెరుగుతున్న జనాభా, క్రీడాకారుల అవసరాలను తీర్చలేకపోతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో.. హనుమకొండ జిల్లాలో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటుతో పాటు.. ప్రత్యేకంగా ఒక క్రికెట్ స్టేడియం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దీనికోసం అవసరమైన 30 ఎకరాల భూమి ధర్మసాగర్ మండలం ఉన్నికిచెర్ల గ్రామంలో.. జాతీయ రహదారి 163కి ఆనుకుని అందుబాటులో ఉందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.వరంగల్ నగరం హైదరాబాద్ తర్వాత రాష్టంలో రెండవ అతిపెద్ద నగరంగా.. ఉత్తర తెలంగాణలో విద్యా, వైద్య, ఇంజనీరింగ్, నిట్, కాకతీయ యూనివర్సిటీ వంటి విద్యా కేంద్రాలతో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. యువతలో క్రికెట్‌పై ఉన్న అపారమైన ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, వరంగల్‌లో ఒక ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందని వివరించారు. సీఎం ఇప్పటికే చేపడుతున్న నగర అభివృద్ధి చర్యలలో భాగంగా క్రికెట్ స్టేడియం మంజూరైతే, అది వరంగల్ నగరానికి ఒక మణిహారంగా మారుతుందని తెలిపారు.ఎమ్మెల్యేల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన సీఎం రేవంత్ రెడ్డి, తక్షణమే సంబంధిత శాఖ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. వరంగల్‌లో క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, తగిన విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని.. త్వరలోనే క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. ఈ హామీతో వరంగల్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టులు వరంగల్ క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని అందించి, భవిష్యత్తులో అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దే అవకాశం ఉంది.

# ఎమ్మెల్యే శ్రీగణేష్ పై దాడికి యత్నం



**హైదరాబాద్:**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై గుర్తుతెలియని వ్యక్తులుదాడికి ప్రయత్నించారు. తార్నాక లోని ఆర్టీసీ హాస్పటల్ సమీపంలో ఎమ్మెల్యే వాహనంపై కొంతమంది దుండగులు దూసుకువచ్చారు. అడ్డుకోబోయిన గన్ మెన్ ల చేతిలో నుంచి వెపన్స్ లాక్కోవడానికి ప్రయత్నించారు. దుండగుల బారి నుంచి తప్పించుకుని ఓయూ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ , పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారు.

# ఖర్గెకు జన్మదిన శుభాకాంక్షలు




**హైదరాబాద్:**పి సి సి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 83 సంవత్సరాల నుండి 84 సంవత్సరాల కి అడుగుపెడుతున్న సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంబర్పేట్ లోని తన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. పార్లమెంటులో మోడీ చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, ఆర్ఎస్ఎస్, బిజెపి లకు వ్యతిరేకంగా పనిచేస్తున్న తమ నాయకుడు ఖర్గే అని అన్నారు. తెలంగాణలో కులగనన జరుగుతున్నట్టే అన్ని రాష్ట్రాల్లో జరగాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారు. బడుగు బలహీన వర్గాల కోసం రాహుల్ గాంధీ ఆలోచిస్తున్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారనీ గుర్తు చేశారు.

సినిమా



# పొగడ్తలతో తేలుతున్న నిధి అగర్వాల్



సాధారణంగా పవన్ కళ్యాణ్ దర్శకులు, నిర్మాతలను పొగిడినంతగా హీరోయిన్లను ప్రశంసల్లో ముంచెత్తడం అరుదు. కానీ నిధి అగర్వాల్ ఆ ఛాన్స్ కొట్టేసింది. ఇవాళ జరిగిన హరిహర వీరమల్లు ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడుతూ నిధి అగర్వాల్ ప్రమోషన్ల భారాన్ని మొత్తం తన భుజాల మీద మోస్తుంటే తనకే సిగ్గనిపించిందని, సినిమాని అనాథలా వదిలేశామనే ఫీలింగ్ కలిగిందని, అలాంటిది లేదని చెప్పడానికి తాను సమావేశానికి వచ్చానని, నా చిత్రాన్ని నేనే ఎందుకు వదిలేస్తానని చెప్పుకొచ్చారు. నిధికి ఇది చాలా పెద్ద కాంప్లిమెంట్. అంటే ఆమె ఎంత సీరియస్ గా పబ్లిసిటీలో భాగం పంచుకుంటుందో పవన్ చూశారన్న మాట. పవన్ చెప్పినదాంట్లో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే సమయాభావం వల్ల హరిహర వీరమల్లులోని మెయిన్ క్యాస్టింగ్ ఎవరూ ఇంటర్వ్యూలకు అందుబాటులో లేరు. సత్యరాజ్, బాబీ డియోల్, సునీల్, సుబ్బరాజు లాంటి వాళ్ళు వేర్వేరు కారణాలతో వచ్చే పరిస్థితిలో లేదు. కీరవాణికి వ్యక్తిగతంగా కుటుంబంలో జరిగిన విషాదం వల్ల మీడియా ముందుకు రాలేకపోయారు. దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో నిధి అగర్వాల్ అంతా తానై చూసుకుంది. ఒక రోజు ఏకంగా 16 మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చి నాన్ స్టాప్ గా కో ఆపరేట్ చేసింది. ఇంత ఓపికగా ఉండటం అరుదే. ది రాజా సాబ్ డిసెంబర్ లో రిలీజ్ కానుండటంతో నిధి అగర్వాల్ కు ఇప్పుడీ హరిహర వీరమల్లు సక్సెస్ చాలా ముఖ్యం.

# విశ్వంభర దర్శకుడి ఎంట్రీ



గత ఏడాది టీజర్ రిలీజై నెగటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చాక విశ్వంభర దర్శకుడు వశిష్ఠ మీడియాకు దొరకలేదు. షూటింగ్ లో బిజీగా ఉండటం, అప్పుడప్పుడు ప్రైవేట్ ఈవెంట్స్ లో కనిపించడం తప్ప తానుగా ఏదైనా చెప్పే చొరవ తీసుకోలేదు. ఇప్పుడు హఠాత్తుగా ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమా తాలూకు ప్రతీకూల ప్రచారాలకు చెక్ పెట్టే ప్రయత్నం చేయడం ఆశ్చర్యపరుస్తోంది. ఇంకా విడుదల తేదీ ఖరారు కాకుండా సడన్ గా ఎంట్రీ ఇవ్వడం మెగా ఫాన్స్ సైతం ఊహించలేదు. అందులోనూ స్టోరీ లైన్ చెప్పేయడం, సినిమా ప్రోగ్రెస్ ని స్పష్టంగా వివరించడం లాంటివి చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హరిహర వీరమల్లు రిలీజ్ ముంగిట్లో వశిష్ఠ ఇలా చేయడం వెనుక కారణమేంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తే కొన్ని విషయాలు తెలిశాయి. ఎప్పుడో సంక్రాంతికి వచ్చే మెగా 157 మీద అటెన్షన్ ఎక్కువవుతోందని, కానీ దాని కన్నా ముందు రిలీజయ్యే విశ్వంభర మీద ప్రేక్షకుల్లో ఆసక్తి సన్నగిల్లడం మంచి సంకేతం కాదని భావించిన చిరంజీవి స్వయంగా వీటికి చెక్ పెట్టే బాధ్యతను వశిష్ఠకు అప్పజెప్పారట. ఇటీవలే మెగాస్టార్ ని కలిసిన కొందరు ఫ్యాన్స్ నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దానికి అనుగుణంగానే వసిష్ఠ విఎఫ్ఎక్స్, స్టోరీ పాయింట్ గురించి ఓపెన్ గా మాట్లాడేస్తున్నాడు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ లో విశ్వంభర రిలీజ్ ఉంటుందనే హింట్ ని వశిష్ఠ ఇవ్వడం చూస్తే పనులు చకచకా జరుగుతున్నట్టు కనిపిస్తోంది. కల్కి 2898 ఏడి, సూపర్ మ్యాన్ 2025కి పని చేసిన విదేశీ నిపుణులే ఇప్పుడీ విశ్వంభరకి వర్క్ చేయడం గురించి వశిష్ఠ గొప్పగా చెప్పుకున్నాడు.

# కాంతారని తక్కువ అంచనా వేయొద్దు



రకరకాల అవాంతరాలు, అడ్డంకులు, యూనిట్ సభ్యుల హఠాన్మరణాలతో ఉక్కిరిబిక్కిరి అయిన కాంతార ఏ లెజెండ్ చాప్టర్ 1 షూటింగ్ అయిపోయింది. ఈ మేరకు అధికారిక మేకింగ్ వీడియోతో హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి దీన్ని ప్రకటించేశారు. ఏమైనా వాయిదా పడుతుందేమోననే ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేశారు. హొంబాలే ఫిలిమ్స్ బ్యానర్ మీద అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిన ఈ ప్యాన్ ఇండియా మూవీ మేకింగ్ వీడియో చూస్తే షాక్ తినడం ఖాయం. గొప్ప విజువల్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతున్న గ్యారెంటీని రెండు నిమిషాల వీడియోలోని ప్రతి ఫ్రేమ్ లో ఇచ్చారు. ఇందులో కంటెంట్ సంగతి పక్కనపెడితే కాంతార పోటీని తక్కువంచనా వేసిన ఎవరైనా ఇప్పుడు ఆలోచించుకోక తప్పదనేలా ఉంది. పేరుకి డబ్బింగ్ లా కనిపిస్తున్నప్పటికీ తెలుగులోనూ కాంతారకి కెజిఎఫ్ రేంజ్ లో సీక్వెల్ హైప్ ఉంది. ఎందుకంటే మొదటి భాగం ఎలాంటి అంచనాలు లేకుండా రెండు వారాలు ఆలస్యంగా రిలీజైనా నలభై కోట్లకు పైగా కలెక్షన్లు తెచ్చింది. దీంతో ఈసారి అంతకు మించి వసూలు చేస్తుందనే ధీమా బిజినెస్ వర్గాల్లో ఉంది. అక్టోబర్ 2 ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న కాంతార ఏ లెజెండ్ చాప్టర్ మీద అన్ని భాషలు కలిపి రెండు వందల కోట్లకు పైగానే బిజినెస్ జరిగేలా ఉంది. ఇక పోటీ విషయానికి వస్తే అక్టోబర్ 1 ధనుష్ ఇడ్లి కదాయ్ వస్తుంది. దానికన్నా వారం ముందు పవన్ కళ్యాణ్ ఓజి, బాలకృష్ణ అఖండ 2లో ఉన్నాయి కనక వెంటనే వారం గ్యాప్ లో కొత్త సినిమాలు రిలీజ్ చేసేందుకు టాలీవుడ్ నిర్మాతలు సాహసించడం లేదు. సో కాంతారకు ఓపెన్ గ్రౌండ్ ఉంటుంది.

# శ్రీలీల ఫ్యాన్స్ హర్టు



తొలి సినిమా ఫట్టయితే హీరో హీరోయిన్ల కెరీర్లు ముందుకు సాగడం కొంచెం కష్టమవుతుంది. కానీ కొన్ని సినిమాలు ఫెయిలైనా.. అందులో ఆర్టిస్టులకు పేరొచ్చి అవకాశాలు వరుస కడుతుంటాయి. ఇలాంటి అదృష్టమే దక్కింది శ్రీలీలకు. కన్నడనాట పుట్టి పెరిగిన ఈ తెలుగమ్మాయి.. 'పెళ్ళిసందడి' చిత్రంతో టాలీవుడ్లోకి అడుగు పెట్టింది. ఆ సినిమా నిరాశపరిచినా.. శ్రీలీల తన అందం, డ్యాన్సులతో యువతను ఆకట్టుకోవడంతో అవకాశాలకు లోటు లేకపోయింది. చూస్తుండగానే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఐతే ఇప్పటిదాకా చేసిన చిత్రాల్లో శ్రీలీల గ్లామరస్‌గా కనిపించింది కానీ.. హద్దులు దాటేమీ అందాలు ఆరబోయలేదు. క్యూట్‌గా అనిపించే శ్రీలీల లాంటి వాళ్లు అతిగా ఎక్స్‌పోజింగ్ చేసినా, బోల్డ్ సీన్లలో నటించినా అంత బాగుండదు అనే అభిప్రాయం ఉంది. కానీ తన కొత్త చిత్రంలో మాత్రం శ్రీలీల బోర్డర్ దాటేసిందని తన ఫ్యాన్స్ ఫీలయిపోతున్నారు. కర్ణాటక రాజకీయ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి హీరోగా పరిచయం అయిన 'జూనియర్'లో శ్రీలీల కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే. శ్రీలీల ఇప్పుడున్న రేంజికి ఒక కొత్త హీరో సినిమాలో కథానాయికగా నటించడం ఒకింత ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే భారీ పారితోషకం ఇచ్చి ఆమెను సినిమాకు ఒప్పించారు. కానీ ఈ సినిమాలో శ్రీలీలది మరీ మొక్కుబడిగా సాగే పాత్ర. కేవలం పాటల కోసం మాత్రమే ఆ క్యారెక్టర్ ఉపయోగపడింది. ఇది ఆమె ఫ్యాన్స్‌కు రుచించలేదు. పైగా 'వైరల్ వయ్యారి' పాటలో శ్రీలీల అప్పీయరెన్స్, హీరో ఆమెతో హద్దులు దాటి చేసిన రొమాన్స్ పట్ల సోషల్ మీడియాలో ఆమె అభిమానుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

# నిఖిల్ చెప్పింది ఆలోచించాల్సిన విషయమే



ఎంతసేపూ టికెట్ రేట్లు పెరగడం వల్లే జనాలు థియేటర్లకు రావడం తగ్గించేశారనే కోణంలోనే చర్చ జరుగుతోంది తప్ప నిజానికి క్యాంటీన్ లో అధిక ధరలకు అమ్ముతున్న స్నాక్స్ వల్ల ఎంత డ్యామేజ్ జరుగుతోందో ఇండస్ట్రీ పెద్దలు గుర్తించడం లేదు. అప్పుడప్పుడు ప్రెస్ మీట్లలో చర్యలు తీసుకుంటామని చెప్పడమే తప్పించి అవి అమలవుతున్న దాఖలాలు కనిపించవు. ముఖ్యంగా మల్టీప్లెక్సుల్లో ఈ దోపిడీ మాములుగా లేదు. పెద్ద స్టార్ హీరో సినిమాకు నైజాంలో గరిష్ట టికెట్ ధర 295 రూపాయలు ఉంటే పాప్ కార్న్ స్టార్టింగ్ రేట్ 300 నుంచి 900 రూపాయల దాకా ఉంటుంది. వాటర్ బాటిల్ వందకు అమ్ముతున్న ఉదాహరణలు ఎన్నో. తాజాగా హీరో నిఖిల్ దీని గురించి ఒక ట్వీట్ వేసి డిస్ట్రిబ్యూషన్ వర్గాలు సీరియస్ గా పరిష్కారం చూడాలని కోరాడు. తనకు సినిమా టికెట్ కు అయిన ఖర్చు కన్నా చాలా ఎక్కువ స్నాక్స్ కు పెట్టానని పేర్కొన్నాడు. ఇమేజ్, సంపాదన, ప్యాన్ ఇండియా మూవీస్ లో నటిస్తున్న మార్కెట్ ఉన్న నిఖిల్ కే అలా అనిపిస్తే ఇక మధ్య తరగతి ప్రేక్షకుల గురించి చెప్పేదేముంది. పిల్లలు అడిగితే కొనివ్వడకుండా ఉండలేని నిస్సహాయతను అనుభవించడం కన్నా అసలు మల్టీప్లెక్సులకే దూరంగా ఉంటే బెటరనే అభిప్రాయం మిడిల్ క్లాస్ జీవుల్లో ఉంది. అందుకే వీక్ డేస్ లో చాలా స్క్రీన్లు జనం లేక షోలు క్యాన్సిలవుతూ ఉంటాయి. కార్పొరేట్ ముసుగులో జరుగుతున్న ఈ దందా పూర్తిగా ఆపేయలేం కానీ కనీస నియంత్రణ అవసరం చాలా ఉంది. నిఖిల్ అన్నట్టు ఒక నీళ్ల బాటిల్ తీసుకెళ్లే స్వాతంత్రం లేనప్పుడు ఖర్చు మీద అదుపు ఎలా వస్తుంది. వసూళ్ల మాయలో పడి ఈ స్నాక్స్ ధరలు చేస్తున్న చేటు చాలా మంది గుర్తించడం లేదు. వీటి వల్ల ఎక్కువగా దెబ్బ తింటున్నది చిన్న బడ్జెట్, మీడియం రేంజ్ సినిమాలే.

# బాలీవుడ్ సూపర్ స్టార్లకు బిగ్ షాక్



ఆమిర్ ఖాన్.. బాలీవుడ్ చరిత్రలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్లలో ఒకడు. లగాన్, రంగ్ దె బసంతి, 3 ఇడియట్స్, పీకే, దంగల్ లాంటి ఇండస్ట్రీ హిట్లు ఇచ్చిన హీరో అతను. కానీ తన చివరి రెండు చిత్రాలకు వచ్చిన ఓపెనింగ్స్ నామమాత్రం. 'లాల్ సింగ్ చడ్డా'కు తొలి రోజు ఆక్యుపెన్సీలు లేక షోలు క్యాన్సిల్ చేసిన పరిస్థితి. ఆయన కొత్త సినిమా 'సితారే జమీన్ పర్' కూడా ఓ మోస్తరు వసూళ్లతో సరిపెట్టుకుంది. ఇక సల్మాన్ ఖాన్ పరిస్థితి చాలా ఏళ్ల నుంచి ఘోరంగా ఉంది. క్రమంగా ఆయన సినిమాలకు ఓపెనింగ్స్ పడిపోతున్నాయి. తన చివరి చిత్రం 'సికందర్' దారుణ పరాభవాన్ని చవిచూసింది. షారుఖ్ ఖాన్ 'పఠాన్', 'జవాన్', 'దంకి' సినిమాలతో పుంజుకున్నాడు కానీ.. అంతకుముందు చేదు అనుభవాలు ఎదుర్కొన్నాడు. తర్వాతి సినిమా సంగతేంటో చూడాలి. అక్షయ్ కుమార్ పరిస్థితి కూడా ఏమంత గొప్పగా లేదు. ఇలాంటి టాప్ స్టార్ల సినిమాలకు హైప్ క్రియేట్ కావడం, ఓపెనింగ్స్ రావడం గగనంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త హీరో హీరోయిన్లు నటించిన 'సైయారా' అనే చిన్న సినిమా బాక్సాఫీస్ దగ్గర రేపుతున్న సంచలనం చూసి ట్రేడ్ పండిట్లు షాకవుతున్నారు. మంచి ప్రోమోలు, పాటలతో రిలీజ్ ముంగిట ఎవ్వరూ ఊహించని స్థాయిలో హైప్ తెచ్చుకున్న ఈ సినిమాకు తొలి రోజు వసూళ్లు అదిరిపోయాయి. శుక్రవారం రూ.21 కోట్ల నెట్ వసూళ్లతో అదరగొట్టింది ఈ సినిమా. కొవిడ్ తర్వాత యశ్ రాజ్ ఫిలిమ్స్ నుంచి వచ్చిన చిత్రాల్లో డే-1 అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఇది మూడో స్థానంలో నిలవడం విశేషం.



# క్రీడలు



## టీం ఇండియాలోకి ఊహించని ప్లేయర్.!



హర్యానా ఫాస్ట్ బౌలర్ అన్షుల్ కాంబోజ్‌ను ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో నాల్గవ టెస్టు మ్యాచ్ కోసం భారత జట్టులో చేర్చారు. ఈ వార్తతో అన్షుల్ కుటుంబ సభ్యులు మరియు అతని కోచ్ సంతోషంతో ఉప్పొంగిపోయారు. పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ మరియు ఆకాశ్ దీప్‌లు గాయపడడంతో ముందు జాగ్రత్తగా అన్షుల్ కాంబోజ్ ను ఎంపిక చేశారు. అర్షదీప్, ఆకాశ్ దీప్ నాల్గవ టెస్టులో ఆడేది సందేహమే. అన్షుల్ సోదరుడు సన్యమ్ కాంబోజ్ ఈ సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "మేము చాలా సంతోషంగా ఉన్నాం. అన్షుల్ భారత జాతీయ జట్టుకు ఎంపికవడం పట్ల మొత్తం కుటుంబం ఆనందిస్తోంది. అతని ఎంపికపై నా సంతోషాన్ని వ్యక్తం చేయడానికి మాటలు సరిపోవు. అతను అకాడమీలో చాలా కష్టపడి ప్రాక్టీస్ చేసేవాడు, ఇంటికి కేవలం నిద్రించడానికి మాత్రమే వచ్చేవాడు" అని వెల్లడించారు. ఈ సంతోషకరమైన సందర్భంలో అన్షుల్ కాంబోజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నామని, అతను టీమ్ ఇండియాకు మరిన్ని విజయాలను అందిస్తాడని ఆశిస్తున్నామని సోదరుడు పేర్కొన్నారు.

## టీమిండియాకు భారీ షాక్..





ఇంగ్లాండ్‌తో జరగనున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, పేసర్ అర్షదీప్ సింగ్ ఈ మ్యాచ్ నుంచి తప్పుకున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ఎడమ మోకాలి గాయం కారణంగా మిగిలిన రెండు టెస్టు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అతను త్వరలోనే స్వదేశానికి తిరిగి రానున్నట్లు బీసీసీఐ తెలిపింది. బీసీసీఐ ఇచ్చిన సమాచారం ప్రకారం, బెకెన్‌హ్యామ్‌లో జరిగిన ట్రైనింగ్ సమయంలో నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు అర్షదీప్ సింగ్ ఎడమ చేతి బొటనవేలికి గాయమైంది. దీంతో అతను మాంచెస్టర్‌లో జరగనున్న ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్ట్ మ్యాచ్ నుంచి తప్పుకోనున్నాడు. దీనితో ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనున్న కీలక టెస్ట్ మ్యాచ్‌లో అర్షదీప్ సింగ్, నితీష్ కుమార్ రెడ్డి ఆడడం లేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. టీమిండియాను గాయాల బెడద వెంటాడుతోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ చూపుడు వేలికి గాయం చేసుకున్నాడు. బంతిని పట్టుకునే ప్రయత్నంలో పంత్‌కు గాయమైంది. దీంతో అతను తదుపరి మ్యాచ్‌లో కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే బరిలోకి దిగనున్నాడు. అంటే మాంచెస్టర్‌లో టీమిండియా తరపున ధ్రువ్ జురెల్ లేదా కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశం ఉంది. అలాగే, లార్డ్స్ టెస్ట్ మ్యాచ్ నాల్గవ రోజు ఆటలో టీమిండియా పేసర్ ఆకాష్ దీప్ తొడ కండరాల నొప్పితో బాధపడ్డాడు. ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న అతనికి కూడా నాలుగో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. నితీష్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్ గాయపడడంతో టీమిండియా యువ పేసర్ అన్షుల్ కంబోజ్ ను ఇంగ్లాండ్‌కు పిలిపించింది. గతంలో ఇండియా 'ఏ' జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కంబోజ్, ప్రథమ శ్రేణి క్రికెట్‌లో 41 ఇన్నింగ్స్‌లలో మొత్తం 79 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండుసార్లు 5 వికెట్ల ప్రదర్శన కూడా ఉంది. ఈ అద్భుతమైన ప్రదర్శనతో 24 ఏళ్ల అన్షుల్ కంబోజ్‌కు భారత టెస్ట్ జట్టులో స్థానం లభించింది.

## నాలుగో టెస్టులో కీలక మార్పు..

## బ్యాట్స్‌మెన్‌గానే రిషబ్ పంత్...?



ఇంగ్లాండ్‌తో జరగనున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే బరిలోకి దిగనున్నాడు. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌లో పంత్ వికెట్ కీపింగ్ చేసే అవకాశం లేదు. అతని స్థానంలో ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్‌గా ఆడించాలని టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా కీపింగ్ చేస్తున్నప్పుడు రిషబ్ పంత్ వేలికి గాయమైంది. బంతిని డైవ్ చేసి పట్టుకునే ప్రయత్నంలో అతని ఎడమ చేతి చూపుడు వేలికి దెబ్బ తగిలింది. దీంతో అతను మ్యాచ్ మధ్యలోనే మైదానాన్ని వీడాల్సి వచ్చింది. పంత్ స్థానంలో రెండు ఇన్నింగ్స్‌లలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. అయితే, రిషబ్ పంత్ మూడో టెస్ట్‌లో బ్యాటింగ్ మాత్రమే చేశాడు. అంటే పంత్‌కు బ్యాటింగ్ చేయడం కష్టం కాదు. కానీ గాయం కారణంగా వికెట్ కీపింగ్ చేయడం పెద్ద సవాలుగా మారింది. అందుకే నాలుగో టెస్టులో రిషబ్‌ను కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రిషబ్ పంత్ కేవలం బ్యాట్స్‌మెన్‌గా బరిలోకి దిగితే, వికెట్ కీపింగ్ బాధ్యతలు ధ్రువ్ జురెల్ లేదా కేఎల్ రాహుల్?లపై పడతాయి. అయితే ధ్రువ్ జురెల్‌ను ఆడించాలంటే, ప్లేయింగ్ ఎలెవన్ నుంచి ఒక బ్యాట్స్‌మెన్‌ను తొలగించాల్సి ఉంటుంది. ఒకవేళ కరుణ్ నాయర్ స్థానంలో ధ్రువ్ జురెల్‌కు అవకాశం లభిస్తే, అతనే వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వహిస్తాడు. ఒకవేళ ధ్రువ్ జురెల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో లేకపోతే, కేఎల్ రాహుల్ గ్లౌవ్స్ వేసుకోవడం ఖాయం. కేఎల్ రాహుల్‌కు ఇంతకు ముందు టీమిండియా తరపున వికెట్ కీపింగ్ చేసిన అనుభవం ఉంది. అంతేకాకుండా, సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌లో కూడా అతను కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. కాబట్టి ధ్రువ్ జురెల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో కనిపించకపోతే, కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా బరిలోకి దిగుతాడు. భారత టెస్ట్ జట్టు స్క్వాడ్: శుభ్?మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్?ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, అన్షుల్ కంబోజ్.

## భారత్-పాక్ మ్యాచ్ రద్దుపై కొత్త ట్విస్ట్..





వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 లో భారత్-పాకిస్థాన్ సెమీ-ఫైనల్ మ్యాచ్ ఉండదని కామిల్ ఖాన్ స్పష్టం చేశాడు. రద్దైన లీగ్ మ్యాచ్ కారణంగా భారత్ కాకుండా పాకిస్థాన్‌కు రెండు పాయింట్లు లభించాయి. షాహిద్ అఫ్రిది క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని పిలుపునిచ్చాడు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ వివాదాస్పదంగా మారింది. జూలై 20న ఎడ్జ్‌బాస్టన్‌లో జరగాల్సిన హై-వోల్టేజ్ లీగ్ మ్యాచ్, విమర్శలు, ఆటగాళ్ల ఉపసంహరణల కారణంగా రద్దయింది. ఇప్పుడు పాకిస్థాన్ ఛాంపియన్స్ టీమ్ యజమాని కామిల్ ఖాన్ ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశాడు. ఒకవేళ ఇరు జట్లు సెమీ-ఫైనల్స్‌కు చేరినా, అక్కడ అవి ఒకదానితో ఒకటి తలపడవని ఆయన కన్ఫాం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "రద్దైన మ్యాచ్ తప్ప మిగతా అన్ని మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయి. టోర్నమెంట్ అనుకున్న విధంగానే కొనసాగుతోంది. సెమీ-ఫైనల్స్ విషయానికొస్తే ఒకవేళ ఇరు జట్లు ఆ దశకు చేరితే అవి ఒకదానితో ఒకటి తలపడకుండా చూస్తాం" అని వివరించాడు. సెమీ-ఫైనల్ గురించి ఓ క్లారిటీ వచ్చినప్పటికీ ఫైనల్లో భారత్-పాకిస్థాన్ తలపడే అవకాశంపై మాత్రం కామిల్ ఖాన్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పుకొచ్చాడు. "ఒకవేళ రెండు జట్లు ఫైనల్‌కు చేరితే, ఆ సమయంలో దాని గురించి ఆలోచిస్తాం. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు" అని ఆయన తెలిపారు.

శిఖర్ ధావన్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్ వంటి కీలక భారత ఆటగాళ్లు తప్పుకోవడంతో, జూలై 20న జరగాల్సిన గ్రూప్-స్టేజ్ మ్యాచ్ రద్దయింది. టోర్నమెంట్ నియమాల ప్రకారం.. భారత్ ఆడటానికి నిరాకరించినందుకు పాకిస్థాన్‌కు రెండు పాయింట్లు లభించాయి. "మేము ఆడటానికి సిద్ధంగా ఉన్నాం. రూల్స్ ప్రకారం పాయింట్లు మాకే రావాలి, అలాగే వచ్చాయి" అని కామిల్ ఖాన్ పేర్కొన్నాడు. పాకిస్థాన్ క్రికెటర్ షాహిద్ అఫ్రిది ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, క్రీడల ద్వారా కలిసి రావాలని పిలుపునిచ్చాడు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, "క్రీడలు ప్రజలను దగ్గర చేస్తాయి, కానీ ప్రతిదానిలో రాజకీయాలు కలిస్తే ఎలా ముందుకు సాగగలం? మనం కూర్చుని చర్చించుకోనంత కాలం, ఏమీ బాగుకాదు. కమ్యూనికేషన్ లోపం విషయాలను మరింత దిగజార్చుతుంది. మేము ఇక్కడ క్రికెట్ ఆడటానికి, ఒకరితో ఒకరు ముఖాముఖి సంభాషించడానికి, స్నేహపూర్వక సంభాషణలు జరపడానికి వచ్చాం" అని అఫ్రిది చెప్పాడు.

## అజయ్ దేవగన్-షాహిద్ అఫ్రిది భేటీ..



అజయ్ దేవగన్, షాహిద్ అఫ్రిది భేటీ ఫోటో వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 లో జరిగిందనే పుకార్లు వ్యాపించాయి. అయితే, ఇది 2024 నాటి ఫోటో అని స్పష్టమైంది. పహల్గామ్ దాడి కారణంగా రద్దైన భారత్-పాక్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 మ్యాచ్, దానిపై అఫ్రిది స్పందించారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అజయ్ దేవగన్, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది కలుసుకున్నారంటూ కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలు భారత అభిమానులలో తీవ్ర విమర్శలకు, ఆగ్రహానికి దారితీశాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ భేటీ వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 ఎడిషన్‌లో జరిగిందని చాలా మంది నెటిజన్లు ఆరోపించారు. అయితే, నిజాలు పరిశీలిస్తే మాత్రం వేరే కథ వెలుగులోకి వచ్చింది. అజయ్ దేవగన్, షాహిద్ అఫ్రిది ని కలిశాడు. కానీ, అది ఈ సంవత్సరంలో మాత్రం కాదు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫోటోలు వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ మొదటి ఎడిషన్ 2024లో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగినప్పుడు తీసినవి. ఈ టీ20 టోర్నమెంట్‌కు సహ యజమాని అయిన దేవగన్, భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను చూడటానికి స్టేడియానికి వచ్చాడు. ఆ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అసలు వివాదం జూలై 20, 2025 ఆదివారం ఎడ్జ్‌బాస్టన్‌లో జరగాల్సిన భారత్, పాకిస్థాన్ మధ్య లెజెండ్స్ మ్యాచ్‌కు సంబంధించింది. అయితే, సోషల్ మీడియాలో, ముఖ్యంగా 26 మంది ప్రాణాలు తీసిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో, నిర్వాహకులు మ్యాచ్ జరగాల్సిన రోజే దానిని రద్దు చేయాలని నిర్ణయించారు. శిఖర్ ధావన్, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా సహా పలువురు ప్రముఖ భారత మాజీ ఆటగాళ్లు ఈ మ్యాచ్ నుంచి తప్పుకున్నారు. శిఖర్ ధావన్ తన నిర్ణయాన్ని మే 11 నాడే నిర్వాహకులకు తెలియజేశానని, పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడబోనని స్పష్టం చేశాడు. ఈ ఆటగాళ్ల ఉపసంహరణ నిర్వాహకులపై మరింత ఒత్తిడి పెంచి, చివరికి మ్యాచ్ రద్దుకు దారితీసింది.

## హర్భజన్ సింగ్ పశ్చాత్తాపం..



భారత క్రికెట్‌లో పెద్ద చర్చకు దారితీసిన సంఘటన ఐపీఎల్ 2008 లో జరిగింది. అప్పట్లో హర్భజన్ సింగ్, శ్రీశాంత్ మధ్య జరిగిన చెంపదెబ్బ సంఘటన సంఘటన సంచలనం సృష్టించింది. ఒక మ్యాచ్ తర్వాత వీరిద్దరు గొడవ పడ్డారు, ఆ తర్వాత శ్రీశాంత్ ఏడుస్తూ కనిపించాడు. హర్భజన్ అతన్ని చెంపదెబ్బ కొట్టాడని అప్పుడు తెలిసింది. ఆ సమయంలో శ్రీశాంత్ పంజాబ్ కింగ్స్ తరపున, హర్భజన్ ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నారు. ఈ విషయంపై చాలా పెద్ద వివాదం చెలరేగింది. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత హర్భజన్ సింగ్ అశ్విన్ షోలో ఈ సంఘటన గురించి మాట్లాడాడు. ఆ గొడవ తర్వాత శ్రీశాంత్ కూతురు తనతో మాట్లాడటానికి ఇష్టపడలేదని, అది తనను చాలా బాధించిందని హర్భజన్ చెప్పాడు. ఆ మాటలు విన్నప్పుడు తను ఎంత కుప్పకూలిపోయాడో వెల్లడించాడు. హర్భజన్ సింగ్ మాట్లాడుతూ, తన జీవితంలో ఒక విషయాన్ని మార్చగలిగితే అది ఈ చెంపదెబ్బ సంఘటన మాత్రమేనని చెప్పాడు. ఎందుకంటే, శ్రీశాంత్, అతని కూతురికి తాను పదే పదే క్షమాపణలు చెప్పినప్పటికీ, దానిని సరిదిద్దలేమని అన్నాడు. మొహాలీలో జరిగిన ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్ తర్వాతే హర్భజన్, శ్రీశాంత్ ను చెంపదెబ్బ కొట్టాడు. మ్యాచ్ ఓడిపోయిన తర్వాత శ్రీశాంత్ భజ్జీని ఆటపట్టించాడని, దాంతో హర్భజన్ ఓపిక కోల్పోయాడని చెప్పాడు. ఇప్పుడు ఈ ఇద్దరు క్రికెటర్లు ఆ సంఘటనను మరిచిపోయి ముందుకు సాగుతున్నారు. కానీ, భజ్జీని మాత్రం ఆ ఘటన ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. అశ్విన్ యూట్యూబ్ షోలో హర్భజన్ సింగ్ మాట్లాడుతూ, "నా జీవితం నుంచి ఒక విషయాన్ని చెరిపివేయాలనుకుంటే, అది శ్రీశాంత్‌తో జరిగిన సంఘటన. అది తప్పు, నేను అలా చేయకూడదు. నేను 200 సార్లు క్షమాపణలు చెప్పాను. ఆ మ్యాచ్‌లో మేము ఒకరికొకరు ఆపోజిట్లో ఆడాం, కానీ అది అలా ప్రవర్తించే స్థాయికి వెళ్లకూడదు. అతనిది ఒకే ఒక్క తప్పు, నన్ను రెచ్చగొట్టాడు, అది ఓకే, కానీ ఆ తర్వాత నేను చేసింది సరికాదు" అని అన్నాడు.




# ఆరోగ్యం



## తిన్న వెంటనే గ్రీన్ టీ తాగితే ప్రమాదంలో పడినట్లే..



ప్రస్తుతం ఆరోగ్యం కోసం చాలామంది గ్రీన్ టీ తాగుతున్నారు. దీని రుచి కొంతమందికి నచ్చకపోయినా ప్రయోజనాల కోసం తాగడం మొదలుపెడుతున్నారు. కాగా ఈ టీ శరీరంలో యాంటీ అక్సిడెంట్లను మేరుపరుస్తుంది. గ్రీన్ టీ తాగితే టైప్-2 డయాబెటిస్ సమస్య దూరమవుతుంది. అయితే కొంతమంది భోజనం చేసిన వెంటనే గ్రీన్ టీ తాగుతున్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. కాబట్టి అందరూ ఆరోగ్యంపై దృష్టిసారించాలి. ప్రస్తుతం ఆరోగ్యం కోసం చాలామంది గ్రీన్ టీ తాగుతున్నారు. దీని రుచి కొంతమందికి నచ్చకపోయినా ప్రయోజనాల కోసం తాగడం మొదలుపెడుతున్నారు. కాగా ఈ టీ శరీరంలో యాంటీ అక్సిడెంట్లను మేరుపరుస్తుంది. గ్రీన్ టీలో ముఖ్యంగా కాటెచిన్లు అనే యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్లు కణాల నష్టం నుంచి రక్షించడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి మొత్తం శ్రేయస్సును ప్రోత్సహించడానికి సహాయపడతాయి.మెదడు పనితీరు మెరుగుపడటం, బరువు నిర్వహణకు మద్దతు ఇవ్వడం మరియు గుండె ఆరోగ్యం మరియు చర్మంపై సానుకూల ప్రభావాలు వంటి కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయి. అయితే భోజనం చేసిన వెంటనే తాగితే మాత్రం సమస్యలు తప్పవు. దీని కారణంగా ఆరోగ్యకార పోషకాలను గ్రహించడం కష్టతరం మారుతుంది. పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉన్న గ్రీన్ టీ జీర్ణక్రియకు ఉపయోగపడినప్పటికి భోజనం చేసిన వెంటనే దీన్ని తీసుకోకూడదు. దీనిలోని కెఫిన్, టానిన్లు జీర్ణక్రియకు హాని కలిగించి అజీర్తికి కారణం అవుతాయి. కొంతమందికి ఉదయాన్నే ఏమి తినకుండా ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగడం అలవాటు. అయితే ఈ పద్ధతి శరీరానికి హాని కలిగిస్తుంది. ఖాళీ కడుపుతో దీన్ని తీసుకుంద వికారం పుడుతుంది. దీనిలో ఉన్న టానిన్లు కారణంగా కడుపులో యాసిడ్ పెరిగి కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలు వస్తాయి.

## రాత్రి భోజనం తర్వాత చిన్న బెల్లం ముక్క నోట్లో వేసుకోండి..!



ఇటీవలి కాలంలో చక్కెర వినియోగం బాగా తగ్గిపోయింది. చక్కెరకు బదులుగా చాలా మంది బెల్లాన్ని ఉపయోగిస్తున్నారు. బెల్ల తినడం వల్ల శరీరానికి చక్కెర కంటే ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సైతం చెబుతున్నారు. ప్రతిరోజూ రాత్రి భోజనం తరువాత చిన్న బెల్లం ముక్క తినడం వల్ల శరీరానికి అమృతంలా పనిచేస్తుందని అంటున్నారు. భోజనం తర్వాత బెల్లం తినడం వల్ల గ్యాస్, అజీర్ణం, అసిడిటీ వంటి కడుపు సమస్యలు తొలగిపోతాయని నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట చిన్న బెల్లంముఖ్క తినడం వల్ల జలుబు, దగ్గు, కఫం వంటి వ్యాధులు కూడా తగ్గుతాయని అంటున్నారు. అంతేకాదు.. గ్లాస్ పాలలో బెల్లం వేసుకుని తాగితే శరీరానికి ఎక్కువ పోషకాలు అందుతాయని అంటున్నారు. బెల్లంలో సహజ ఫైబర్, ఎంజైమ్‌లను సమృద్ధిగా ఉంటాయి. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో ఉపయోగపడుతుంది. అంతే కాకుండా గ్యాస్ట్రిక్ రసాల ఉత్పత్తిని కూడా నియంత్రిస్తుంది. దీంతో గ్యాస్, గుండెల్లో మంట, అసిడిటీ వంటి సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. బెల్లం తినటం వల్ల గొంతుకు ఉపశమనం కలిగిస్తుంది. చిన్న బెల్లం ముక్క తినటం వల్ల శరీరం నుండి విష వ్యర్థాలను బయటకు పంపుతుంది. కాలేయం, జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మీకు మలబద్ధకం సమస్య ఉంటే గనక తిన్న తర్వాత ఖచ్చితంగా బెల్లం తినండి. దీనిలో ఉండే సహజ లక్షణాలు ప్రేగుల పనితీరును మెరుగుపరుస్తాయి. బెల్లం ఐరన్‌కు మంచి మూలం. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మహిళలు, రక్తహీనతతో బాధపడేవారు ఖచ్చితంగా బెల్లం తినాలని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు..బెల్లంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు , ఖనిజాలు శరీర రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యలను దరిచేరకుండా చేస్తుంది. చర్మ సౌందర్యానికి కూడా బెల్లం చాలా మంచిది. ప్రతిరోజూ కొద్దిగా బెల్లం తినడం వల్ల మొటిమలు తొలగిపోతాయి. బెల్లంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారికి బెల్లం ఔషధంగా పనిచేస్తుంది. మలబద్ధకం నివారించడానికి రాత్రి పడుకునే ముందు బెల్లం తినడం ఈ రోజు నుండే ప్రారంభించండి.


## యాపిల్ గింజలతో ఆ సమస్యల ప్రమాదం..



రోజూ ఒక యాపిల్ తింటే పలు రోగాలను దూరం చేసుకోవచ్చునని డాక్టర్లు చెబుతుంటారు. వారు చెప్పినట్లే ఈ పండులో బోలెడు పోషకాలు ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్లు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరాన్ని పలు వ్యాధుల నుండి దూరంగా ఉంచుతాయి. ఈ సంగతి పక్కన పెడితే మనలో చాలామంది గింజలు తీసేసి యాపిల్‌ను తింటుంటారు. అయితే కొందరు మాత్రం గింజలు కూడా తినేస్తుంటారు. అయితే ఇలా తినడం వల్ల పలు సమస్యలు తలెత్తుతాయట. దీనికి సంబంధించి యాపిల్ విత్తనాలపై ఇటీవల జరిపిన శాస్త్రీయ పరిశోధనలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. యాపిల్ గింజల్లో అమిగ్డాలిన్ అనే విష సమ్మేళనం ఉంటుంది. వీటిని తిన్నా, నమిలిలా అమిగ్డాలిన్ హైడ్రోజన్ సైనైడ్‌గా మారుతుంది. ఇది శరీరానికి చాలా హానికరం. అందుకే పెద్ద మొత్తంలో యాపిల్ గింజలను తీసుకోకూడదంటున్నారు పరిశోధకులు. అమిగ్డాలిన్ సాధారణంగా రోసేసి కుటుంబానికి చెందిన పండ్ల విత్తనాలలో అధిక మొత్తంలో ఉంటుంది. ఆపిల్, బాదం, ఆప్రికాట్లు, పీచెస్, చెర్రీస్ తదితర పండ్లలో ఇది ఎక్కువగా ఉంటుంది. దీనిని విషంగా పరిగణిస్తారు.

ఇది శరీరంలోని కణాలకు ఆక్సిజన్ చేరకుండా చేస్తుంది. చిన్న మొత్తంలో సైనైడ్ శరీరానికి స్వల్పకాలిక తేలికపాటి నష్టాన్ని కలిగిస్తుంది. ఇందులో తలనొప్పి, గందరగోళం, అలసట, నీరసం తదితర సమస్యలు తలెత్తుతాయి. ఇక శరీరంలో సైనైడ్ ఎక్కువగా ఉంటే అధిక రక్తపోటు, స్ట్రోక్స్, మూర్ఛ వంటి తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. ఒక్కోసారి కోమాలోకి వెళ్లి మరణం కూడా సంభవించవచ్చు. అమిగ్డాలిన్ పరిమాణం యాపిల్ రకాన్ని బట్టి ఉంటుంది. అమిగ్డాలిన్ ప్రాణాంతకం కానప్పటికీ శరీరానికి హానికరం అని చెప్పుకోవాలి. అందుకే చిన్న పిల్లలకు గింజలు తీసేసిన యాపిల్‌ను తినిపించాలంటున్నారు నిపుణులు. 2015 పరిశోధనల ప్రకారం, ఒక గ్రాము ఆపిల్ గింజలలో అమిగ్డాలిన్ ఒకటి నుంచి నాలుగు మిల్లీగ్రాముల మధ్య ఉంటుంది. ఇది వివిధ రకాల ఆపిల్‌లను బట్టి ఉంటుంది. అయితే, విత్తనాల నుంచి విడుదలయ్యే సైనైడ్ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. 50-300ఎవ్త్ర హైడ్రోజన్ సైనైడ్ ప్రాణాంతకం కావచ్చు. ఒక గ్రాము ఆపిల్ గింజలో 0.6ఎవ్త్ర హైడ్రోజన్ సైనైడ్ ఉంటుంది. అంటే 80 నుంచి 500 గింజలు తింటే మనిషికి ప్రాణాపాయం తప్పదు. ఇక పరిశోధనలో, శాస్త్రవేత్తలు అమిగ్డాలిన్‌ను నివారించడానికి, యాపిల్స్ తినడానికి, యాపిల్ జ్యూస్ తాగే ముందు వాటి విత్తనాలను తొలగించడం మంచిదని సలహా ఇచ్చారు. ముఖ్యంగా పిల్లలకు ఆపిల్ గింజలు తీసిన తర్వాత తినిపించాలి.

## అలా చేస్తే డేంజర్‌లో పడతారు..



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం.. దీనికోసం మంచి ఆరోగ్యకరమైన .. పోషకరమైన ఆహారం తీసుకోవాలి.. అయితే.. మనం తిన్న వెంటనే కొన్ని పనులు చేస్తాము.. వాటివల్ల ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది.. తిన్న వెంటనే మనం చేసే కొన్ని తప్పులతో ఏరికోరి అనారోగ్యాన్ని తెచ్చుకుంటున్నట్లేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం.. దీనికోసం మంచి ఆరోగ్యకరమైన .. పోషకరమైన ఆహారం తీసుకోవాలి.. అయితే.. మనం తిన్న వెంటనే కొన్ని పనులు చేస్తాము.. వాటివల్ల ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది.. తిన్న వెంటనే మనం చేసే కొన్ని తప్పులతో ఏరికోరి అనారోగ్యాన్ని తెచ్చుకుంటున్నట్లేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి.. మనం తరచుగా తిన్న వెంటనే ఇలాంటి పనులు కొన్ని చేస్తాము.. వాటినే అలానే కంటిన్యూ చేస్తే ఆ తర్వాత మనం చింతించాల్సి వస్తుందని.. అలాంటి అలవాట్లు మన ఆరోగ్యానికి ప్రయోజనం కంటే హానిని ఎక్కువగా కలిగిస్తాయని.. ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం చాలా మందికి హానికరం కాదని అనిపించవచ్చు.. కానీ అది శరీరంపై దుష్ప్రభావాలను కలిగిస్తుంది. వాస్తవానికి, ఆహారాన్ని జీర్ణం చేయడానికి రక్త ప్రసరణ ప్రభావవంతంగా ఉండాలి. కానీ మీరు తిన్న వెంటనే స్నానం చేయడానికి వెళితే, అది రక్త ప్రసరణను నెమ్మదిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను నెమ్మదిస్తుంది. ఇది కడుపులో భారమైన అనుభూతిని కలిగిస్తుంది. అందువల్ల, భోజనం చేసిన వెంటనే స్నానం చేయడానికి తొందరపడకండి.. దీని కోసం అరగంట పాటు వేచి ఉండండి. తిన్న వెంటనే తేలికపాటి నడక ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. కానీ చాలా మంది ఆహారం జీర్ణం కావడానికి తిన్న వెంటనే వేగంగా నడవడం ప్రారంభిస్తారు. కొంతమందైతే ఏకంగా వ్యాయామం లాంటివి చేస్తారు. ఈ పద్ధతి జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. దీనివల్ల మీకు నీరసం లేదా వాంతులు కూడా వస్తాయి. అందువల్ల, తిన్న తర్వాత దాదాపు గంటసేపు నడవకుండా లేదా ఎటువంటి వ్యాయామం చేయకుండా ఉండటానికి ప్రయత్నించండి. దీని తర్వాత, మీరు దాదాపు 20 నిమిషాలు నెమ్మదిగా నడవవచ్చు.. తరువాత స్పీడ్ వాక్ చేయవచ్చు. భోజనం తర్వాత అందరూ విశ్రాంతి తీసుకోవాలని కోరుకుంటారు. కానీ చాలా త్వరగా పడుకోవడం వల్ల మీ కడుపులోని ఆమ్లం మీ అన్నవాహికలోకి వెళ్లి, మీరు భరించలేని మంటతో బాధపడతారు. ఈ పరిస్థితిని మనం గుండెల్లో మంట అంటాము. మీరు విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, నిటారుగా కూర్చోవడానికి ప్రయత్నించండి. ఇది ఆమ్లం మీ అన్నవాహికలోకి వెళ్లకుండా నిరోధిస్తుంది.. ఇది గుండెల్లో మంట, ఉబ్బరాన్ని నివారిస్తుంది. భోజనం తర్వాత పడుకునే బదులు, కొద్దిసేపు నడవడానికి ప్రయత్నించండి. చాలా మంది భోజనం చేసిన వెంటనే వేడి టీ లేదా కాఫీ తాగడానికి ఇష్టపడతారు. దీనివల్ల వారు ఉత్సాహంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ వాస్తవానికి అలా చేయడం వల్ల వారి ఆరోగ్యానికి హాని కలుగుతుంది. అలా చేయడం వల్ల శరీరం ఐరన్, ఇతర ముఖ్యమైన ఖనిజాలను గ్రహించే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. టీలో ఉండే టానిన్ ఇనుము శోషణకు ఆటంకం కలిగిస్తుంది. మీ శరీరంలో ఐరన్ లోపం ఉంటే లేదా రక్తహీనత ప్రమాదం ఉంటే, భోజనం చేసిన వెంటనే టీ తాగే ముందు మీరు ఒక గంట వేచి ఉండాలి. చాలా మంది భోజనం తర్వాత పొగ తాగడానికి ఇష్టపడతారు. అలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని వారు నమ్ముతారు.. కానీ నిజం ఏమిటంటే మీ శరీరం ఎక్కువ హానికరమైన అంశాలను గ్రహిస్తుంది. ఇది మాత్రమే కాదు, ధూమపానం జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. దీనివల్ల కడుపు ఆహారాన్ని జీర్ణం చేసుకునే సామర్థ్యం కూడా ప్రభావితమవుతుంది. ఇది ఎక్కువ ఆమ్ల ఉత్పత్తికి దారితీస్తుంది. మీరు దీన్ని నివారించాలనుకుంటే, ధూమపానం పూర్తిగా మానేయండి. ఇది మీ కడుపు, ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతుంది.



# వ్యాపారం




## యుపిఐ చెల్లింపుల్లో మనమే టాప్..!




భారతదేశం యూపీఐ చెల్లింపులలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రతి నెల 1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. జూన్ 2024లో 24.03 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు నమోదయ్యాయి. 49.1 కోట్ల మంది ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడంతా డిజిటల్ కాలం అయిపోయింది. ఫిజికల్ క్యాష్ తీసుకోవడం ఇప్పుడు చాలా వరకు తగ్గిపోయిందనే చెప్పాలి. చిన్నా పెద్దా అన్ని అవసరాలకు కూడా యూపీఐనే వాడేస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పెరిగిపోయారు. అందుకు తగ్గట్టే.. డిజిటల్ చెల్లింపులు కూడా భారీగా పెరిగాయి. ఎంతలా అంటే యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే ఇండియా నంబర్ వన్‌గా నిలిచింది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. నేడు మన దేశంలో ప్రతి నెలా 1800 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్లు యూపీఐ ద్వారా బదిలీ అయ్యాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. 2024లో ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీలు కాగా.. ప్రస్తుతం 32 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. దేశంలో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క మన దేశంలోనే జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి ఏడు దేశాల్లో యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వు బ్యాంకు యోచిస్తోంది. సురక్షితమైన, వేగవంతమైన లావాదేవీల వల్ల యూపీఐ చెల్లింపులు ప్రజల్లో ఇంత ఆదరణ పొందాయి.

## నిరాశపర్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్




దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.31 శాతం తగ్గుదలతో రూ.16,258 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.16,475 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 83,701 కోట్లుగా నమోదు కాగా.. గడిచిన క్యూ1లో ఏకంగా రూ.99,200 కోట్ల ఆదాయాన్ని సాధించింది. క్రితం క్యూ1లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మొత్తం వ్యయం రూ.63,467 కోట్లకు చేరింది. 2024-25 ఇదే క్యూ1లో రూ.59,817 కోట్ల వ్యయాలు చోటు చేసుకున్నాయి. గడిచిన త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.14,442 కోట్లు కేటాయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.2,602 కోట్ల కేటాయింపులతో పోల్చితే భారీగా పెంచాల్సింది. 2024 జూన్ ముగింపు నాటికి 0.47 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు.. 2025 జూన్ 30 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.4 శాతానికి పెరిగాయి. స్థూల అడ్వాన్సులు 6.7 శాతం పెరిగి రూ.26.53 లక్షల కోట్లకు, డిపాజిట్లు 16.2 శాతం వృద్ధితో రూ.27.64 లక్షల కోట్లకు చేరాయి. దేశంలోనే రెండో అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభాలు పెరిగాయి. 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 15.5 శాతం వృద్ధితో రూ.12,768 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,059 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.19,553 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ1లో 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.15 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన ప్రథమ త్రైమాసికం (క్యూ1)లో యెస్ బ్యాంక్ నికర లాభాలు 59 శాతం పెరిగి రూ.801 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.502 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా.. గడిచిన క్యూ1లో ఈ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 5.7 శాతం పెరిగి రూ.2,371.5 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలు 1.6 శాతం, నికర ఎన్‌పీఏలు 0.3 శాతంగా నమోదయ్యాయి.

## మళ్లీ పెరిగిన పసిడి ధరలు..



బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల ఆల్‌టైమ్ హైకి చేరిన పసిడి ధర.. తగ్గినట్లే తగ్గి మళ్లీ లక్ష మార్క్ దాటింది. అటు వెండి కూడా ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయికి చేరుకున్నాయి.. ఇలా గోల్డ్, సిల్వర్ ధరలు నాన్‌స్టాప్‌గా పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఒక్కోసారి ధరలు పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతుంటాయి. తాజాగా.. బంగారం ధర మళ్లీ పెరగగా.. వెండి ధర స్థిరంగా కొనసాగుతోంది. జూలై 21 2025 సోమవారం ఉదయం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,00,150 ఉంటే.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.91,800 లుగా ఉంది. పది గ్రాముల బంగారంపై రూ. 110 మేర ధర పెరిగింది. వెండి ధర కిలో రూ.1,16,000 గా ఉంది. అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,00,150 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.91,800 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,26,000 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,00,150, 22 క్యారెట్ల ధర రూ.91,800 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,26,000 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,00,300, 22 క్యారెట్ల ధర రూ.91,950 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,16,000 లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,00,150, 22 క్యారెట్ల ధర రూ.91,800 ఉంది. వెండి ధర కిలో రూ.1,16,000 గా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,00,150 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.91,800 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,26,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,00,150, 22 క్యారెట్ల ధర రూ.91,800 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,16,000 లుగా ఉంది.

## యూనియన్ బ్యాంక్ లాభాల్లో 12 శాతం వృద్ధి




ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 12 శాతం వృద్ధితో రూ.4,116 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 3,679 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.30,874 కోట్లుగా ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.31,791 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం 27,296 కోట్లకు చేరింది. 2024-25 క్యూ1లో వడ్డీ ఆదాయం రూ.26,364 కోట్లుగా చోటు చేసుకుంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు క్రమంగా మెరుగుపడుతూ.. గడిచిన త్రైమాసికంలో 3.52 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 4.54 శాతం స్థూల ఎన్‌పీఏలు నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.90 శాతం నుంచి 0.62 శాతానికి తగ్గాయి. మొండి బాకీల కోసం కేటాయింపులు 1,1,53 కోట్లకు తగ్గాయి. 2024-25 ఇదే జూన్ త్రైమాసి కంలో మొండి బాకీల కోసం రూ.1,651 కోట్ల కేటాయింపులు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో సెంట్రల్ బ్యాంక్ నికర లాభాలు 33 శాతం పెరిగి రూ.1,169 కోట్లకు చేరాయి. ముఖ్యంగా కీలక ఆదాయం పెరగడంతో పాటుగా, మొండి బాకీలు తగ్గడంతో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.880 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.9,500 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.10,374 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.54 శాతం నుంచి 3.13 శాతానికి పరిమితమయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.73 శాతం నుంచి 0.40 శాతానికి దిగివచ్చాయి.

## ఆటో ఎగుమతుల జోరు




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆటోమొబైల్ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ కాలంలో మొత్తం ఎగుమతులు 14,57,461 యూనిట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు రికార్డు స్థాయికి చేరటంతో పాటు ద్విచక్ర, వాణిజ్య వాహన విభాగాల్లో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి కారణమని సియామ్ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. పశ్చిమాసియా సహా అమెరికా మార్కెట్లలో స్థిరమైన డిమాండ్ కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. ఈ కాలంలో ద్విచక్ర, వాణిజ్య వాహన ఎగుమతులు 23 శాతం వృద్ధితో వరుసగా 11,36,942 యూనిట్లు, 19,427 యూనిట్లుగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ 96,181 యూనిట్లను ఎగుమతి చేసి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2030 నాటికి దేశీయ ద్విచక్ర వాహన మార్కెట్లో వాటా 30 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ మార్కె ట్లో 27 శాతం వాటాతో హోండా రెండో స్థానంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 1.88 కోట్ల యూనిట్లుగా ఉండగా హోండా మోటార్‌సైకిల్ విక్రయాలు 47.89 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. కాగా హీరో మోటోకార్ప్ 54.45 లక్షల యూనిట్ల విక్రయాలతో అగ్రస్థానంలో ఉంది.

## భారత్ నుంచి తరలిన 5 బిలియన్ల పెట్టుబడులు



పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయంగా కనబడుతున్నట్లు లేదు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లు విదేశాల్లో పెట్టుబడులకు ఎక్కువగా మొగ్గు చూపిస్తున్నారని తెలుస్తోంది. ఇందుకు భారత్ నుంచి బయటకు వెళ్లిన ఎఫ్‌డిఐల గణాంకాలే నిదర్శనం. ప్రస్తుత ఏడాది జూన్‌లో బయటికి తరలిపోయిన ఎఫ్‌డీఐలు 5.03 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో ఈ మొత్తం 2.9 బిలియన్ డాలర్లతో పోల్చితే దాదాపు 74 శాతం పెరుగుదల చోటు చేసుకుందని స్వయంగా ఆర్‌బిఐ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు తరలిపోయిన వాటిలో ఈక్విటీ పెట్టుబడులు 2.04 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇవి గతేడాది ఇదే నెలలోని 670.7 మిలియన్ డాలర్లతో పోల్చితే మూడు రెట్ల పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ కాలంలో విదేశాలకు తరలిపోయిన పెట్టుబడులు 6.64 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 4.3 బిలియన్ పెట్టుబడులు తరలిపోయాయి.

# జూరాల వద్ద విషాదం.. కొంపముంచిన సెల్ ఫోన్ డ్రైవింగ్



జోగులాంబ గద్వాల,జులై21(స్కై న్యూస్ ): ధరూర్ మండలంలోని జూరాల డ్యామ్ వద్ద ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో తమపై కారు దూసుకురావడంతో ఒక యువకుడు ప్రాణభయంతో డ్యామ్లోకి దూకి గల్లంతయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడగా, ఇద్దరు యువకులు మాత్రం ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు.వివరాల్లోకి వెళితే, మానవపాడు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన మహేష్ (21), జానకిరాములు, ఇంకా ఇద్దరు స్నేహితులు కలిసి జూరాల డ్యామ్ సందర్శనకు వచ్చారు. రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో వారు డ్యామ్ బ్రిడ్జిపై నుంచి గద్వాల వైపు వెళ్తుండగా, కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి డ్రైవింగ్ చేస్తున్న కారు అజాగ్రత్తగా, సెల్ఫోన్ చూస్తూ మోటారు సైకిళ్లను ఢీకొట్టేందుకు దూసుకొచ్చింది.ప్రమాదం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మహేష్ డ్యామ్లో పడిపోయి గల్లంతయ్యాడు. జానకిరాములు తీవ్రంగా గాయపడ్డాడు. మిగతా ఇద్దరు యువకులు దూరంగా ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. గాయపడిన యువకుడిని హుటాహుటిన హైదరాబాద్కు తరలించి వైద్యం అందిస్తున్నారు.

# పెండింగ్లో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి: డీఎస్పీ నల్లపు లింగయ్య




నారాయణపేట జూలై 21 (స్కైన్యూస్) ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారుల పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. సోమవారం రోజు డీఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 05 మంది ఫిర్యాదులను డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫైర్ నమోదు చేయాలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూ తగదాలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా రసీదు, ఎఫ్ ఐ ఆర్ కాఫీ ఇవ్వాలని పోలీసు అధికారులకు తెలిపారు. జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా భద్రత కల్పించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు.

# జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలి




నాగర్ కర్నూల్ జులై 21 (స్కై న్యూస్) 1 మరియు 2 తేదీలలో కల్వకుర్తి పట్టణంలో జరిగే సిపిఐ మూడవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ కోరారు సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో యేసయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం పూర్తిగా విస్మరించి హిందూ ముస్లిం మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ప్రజా పాలనను గాలికి వదిలి ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా రుణమాఫీ నిధులను విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి హక్కులను సాధించుకోవడం జరిగిందని సుమారు 1500 మంది వీరమరణం పొందాలని తెలిపారు 1న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో బహిరంగ సభకు రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి లు హాజరవుతున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద జి వార్ల వెంకటయ్య కేశవులు గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ ఇందిరమ్మ చంద్రమౌళి భరత్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కృష్ణాజి శివుడు శ్రీనివాసులు రవీందర్ బాలమురళీకృష్ణ సూర్య శంకర గౌడ్ పరషరాములు శివశంకర్ లక్ష్మీపతి మధు గౌడ్ ప్రేమ్ కుమార్ ఆంజనేయులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

# 23న సెర్ఫ్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేద్దాం

**ఎన్పీఆర్డీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి పిలుపు**



షాద్నగర్ 21(స్కైన్యూస్):వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్లోని సెర్ఫ్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా ఎన్పీఆర్డీ అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి నేతృత్వంలో ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భుజంగారెడ్డి మాట్లాడుతూ....అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు నెలకు రూ. 6,000 పింఛన్ ఇవ్వాలని హామీ ఇచ్చిందని అయితే అధికారంలోకి వచ్చి దాదాపు 19 నెలలు గడిచినా ఆ హామీని నెరవేర్చకపోవడం బాధాకరమని తీవ్రంగా విమర్శించారు.వికలాంగుల పింఛన్ పెంపుతో పాటు, చేయూత లబ్దిదారుల సమస్యలు కూడా ఇంకా పరిష్కారం కాలేదని, ప్రభుత్వ ఉదాసీన వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.జూలై 23న సెర్ఫ్ కార్యాలయం ముందు నిర్వహించే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వికలాంగులు, చేయూత లబ్దిదారులు, సంఘం నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ హక్కుల సాధన కోసం గళం వినిపించాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 12000

# వ్యవసాయ కూలీలందరికీ తక్షణమే అమలు చేయాలి

**ఏ.ఐ.పి.కే.ఎం.ఎస్ డిమాండ్**



నారాయణపేట జూలై 21 (స్కైన్యూస్) అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, ( ఏ ఐ పి కె ఎం ఎస్ ) నారాయణపేట జిల్లా కమిటీ సమావేశం మద్దూరు మండల కేంద్రంలో శారద హైస్కూల్లో నిర్వహించారు. జిల్లాలోని ప్రతినిధులు పాల్గొన్నారు ఈ సమావేశంలో ఏఐపీకె ఎం ఎస్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సలీమ్,జిల్లా కార్యదర్శి ప్రశాంత్ వ్యవసాయ కూలీల కు ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, వ్యవసాయ కూలీలకు సమగ్రంగా కనీస వేతనాలు చట్టం చేయాలని, అర్హులైన నిరుపేదలందరికీ రేషన్ కార్డులో పెన్షన్లు కూలీలురైతులు, ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12,000 రూపాయలను ఇస్తామని హామీ ఇచ్చారు అధికారాన్ని చేపట్టి ఏడాదిన్నర పూర్తయిన తరుణంలో ఒకవైపు సంబరాలను జరుపుకుంటున్న ప్రభుత్వం వ్యవసాయ కూలీలను విస్మరించిందన్నారు. మార్చిలో జరిగిన ప్రజా పాలనలో అర్హులు నుండి దరఖాస్తు చేసుకున్న విచారణ అర్హతను గుర్తించకుండా, ఉపాధి హామీ కార్డు ఉండి పనిచేసిన వారికి లింకు చేయడంతో భూమిలేని వలస కార్మికులు పొట్ట చేత పట్టుకొని ఇల్లు వదిలిన వ్యవసాయ కూలీలకు అన్యాయం జరిగింది. సమగ్ర వ్యవసాయ పనుల్లో వ్యవసాయ కూలీలుభూమి కలిగిన మూడు ఎకరాల లోపు ఉన్న వ్యవసాయ కూలీలు ఏడాది పొడుగునా వ్యవసాయ కూలీలు గానే బ్రతుకుతున్నారన్నారు.వీరందరూ పథకాన్ని పొందలేకపోతున్నారు.కావున మూడు ఎకరాల లోపు భూమి కలిగిన వ్యవసాయ కూలీలందరికీ గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి 12,000 రూపాయలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరొక హామీలో పెన్షన్లను రెట్టింపు చేసి ఇస్తామన్న హామీ నిలబెట్టుకో లేదన్నారు కొత్త పెన్షన్లు ఊసే లేదని వాపోయారు. ప్రజా ప్రభుత్వం అంటూ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల నుండి లబ్ధిదారులను ఎంపిక చేయడం వల్ల పలు పథకాల్లో అర్హులను గుర్తించడం లేదన్నారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయని పక్షంలో ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు ఒకటి నుండి గ్రామాల్లో ప్రచారం, 10 నుండి మండల కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 5 నుండి జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, సెప్టెంబర్ 10 చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. తక్షణమే ప్రభుత్వం వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులందరినీ సంఘటిత పరిచేందుకై గ్రామ మండల జిల్లా స్థాయిలో సంస్థాగత సభలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ ఉన్న ఇండ్లు పెన్షన్లు రేషన్ కార్డులు అర్హత ఉన్న వారికి అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ కావడం వల్ల రైతాంగానికి మిగిలిపోయిన రైతుల రుణమాఫీని పూర్తిచేయాలని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా బ్యాంకులు రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రారంభమైన దశలో భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ నష్టపరిహారం పెంచాలని పలు మండలాల్లో జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేస్తున్న రైతుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామన్నారు నిర్వాసితుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు %%చెన్నప్ప, జి వెంకట్ రాములు, హాజీ మలంగ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, సభ్యులు అంబటి నరసింహులు, వెంకటేష్,నర్సింలుపాల్గొన్నారు.

## సమాజానికి ఉపయోగపడదాం

# సేవా సంకల్ప్ 14వ వార్షికోత్సవ ఇన్స్టలేషన్






షాద్నగర్ 21(స్కైన్యూస్):లయన్స్ క్లబ్ అఫ్ షాద్ నగర్ సేవా సంకల్ప్ 14వ వార్షికోత్సవ ఇన్స్టలేషన్ ప్రోగ్రాంను స్థానిక కేకేఆర్ కన్వెన్షన్ హాల్ షాద్ నగర్ లో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షునిగా లయన్ రవి కుమార్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ లయన్ రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను చేపట్టారు. అదేవిదంగా క్లబ్ సెక్రటరీగా లయన్ విజేందర్ రెడ్డి, ట్రెజరర్ గా లయన్ శ్రీ రామ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ గా లయన్ లింగారెడ్డి మరియు ఇతర లయన్ సభ్యులందరు కూడ ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిదంగా నూతన సభ్యులను వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ శశికాంత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నూతన కార్యవర్గం సమాజానికి ఉపయోగ పడే ఎన్నో కార్యక్రమాలు చెయ్యాలి అని ఆశీర్వదించారు. అదేవిదంగా ఈ కార్యక్రమంలో అతిథులుగా డిస్ట్రిక్ట్ కాబినెట్ సభ్యులు లయన్ శరత్ చంద్రబాబు గారు, లయన్ ఎంవిఎస్ రంగయ్య, రీజియన్ చైర్మన్ లయన్ మనోహర్ రెడ్డి, లయన్ రాజు, ప్రోగ్రాం చైర్మన్ లయన్ అమరేందర్ రెడ్డి, కో చైర్మన్ డాక్టర్ శివానంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ అఫ్ సెర్మనీగా లయన్ మదన్ మోహన్ రెడ్డి, లయన్ శివ నాగయ్య నిర్వహించారు. అదేవిదంగా ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అధికారులు పాల్గొన్నారనీ లయన్స్ క్లబ్ అఫ్ సేవా సంకల్ప్ సెక్రటరీ లయన్స్ విజేందర్ రెడ్డి తెలిపారు..

# గ్రామీణ ఓటర్లు చూపు బీజేపీ వైపు

**..స్థానిక ఎన్నికలకు కార్యకర్తలుసిద్ధంగా ఉండండి**



జోగులాంబ గద్వాల,జులై21(స్కై న్యూస్ ): మల్దకల్ మండలం మల్దకల్ గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు బి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మండలం ఎన్నికల కార్యాశాల జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా స్థానిక ఎన్నికల కన్వీనర్ నల్లారెడ్డి మాట్లాడుతూ బీజేపీ జాతీయ ఉప అధ్యక్షురాలు, పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ గారి సహకారంతో జిల్లా మెజారిటీ ఎంపిటిసి జెడ్పిటిసి, సర్పంచ్ స్థానాలు గెలుపు తథ్యం అని అదేవిదంగా ఈరోజు గ్రామాలలో ప్రతి బడ్జెట్ నేరుగా గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులే అందులో భాగంగా కరోనా నుంచి ఉచిత బియ్యం నిరంతరంగా పంపిణీ చేస్తున్నది , రైతు వేదికలు ,పల్లె ప్రకృతివనం,వైకుంఠదామలు, టాయిలెట్స్, ఎరువుసబ్సిడీ, విశ్వకర్మ,ముద్రలోన్స్, సిసి రోడ్లు వీధి బలుపులు అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు గర్భిణీలకుపొష్టికాహారం కేంద్ర ప్రభుత్వమే అదేవిధంగా ఈరోజు దేశ రక్షణలోకూడా మన దేశం చాలా సురక్షితంగా ఉన్నది మొన్న జరిగిన పహల్గాం దాడిలో కూడా చర్యకు ప్రతి చర్యపాకిస్తాన్లో వారి ప్రాంతాలలో నడిబొడ్డున బాంబులు పేల్చి వాళ్ళ స్థావరాలను మట్టి పెట్టిన ఘనత మన ప్రియతమ నేత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ కి దక్కుతుందని తెలిపారు అదే విధంగా ఆర్థికంగా దినదినాభివృద్ధి జరుగుతూ అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా 4 వ స్థానం నుండి ఈరోజు నాలుగో స్థానానికి ఆర్థికంగా చాలా స్ట్రాంగ్ గా రోజు రోజుకి అభివృద్ధి చెందుతున్నది మన భారతదేశం అది కేవలం ఈరోజు దేశాన్ని పాలిస్తున్న భారతీయ జనతా పార్టీకే ఈ అవకాశం దక్కుతున్నది తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్లు పాలించి అదిగో ఇదిగో అని ఏదో మాయ మాటలు చెప్పి తన పది సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకున్నది తప్ప రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించలేదు ఈరోజు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు 160 అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం ఏ ఒక్కటి కూడా ప్రజలకు నెరవేర్చలేదు. అదేవిదంగా బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్యనాయకులు లిక్కర్, కాళేశ్వరం, తెలిపోన్ ట్యాంపరింగ్, మరియు చాలా కుంభం కోణాలు, కుటుంబ గొడవలు తో రాష్టాన్ని నాశనం చేశారు. కాబట్టి ఇప్పుడు కేవలం బీజేపీ పార్టీ మాత్రమే దేశం, రాష్ట్ర మరియు స్థానిక గ్రామాలలో ప్రతి ఆర్థిక సంక్షేమ పథకం కేంద్ర ప్రభుత్వానిదే కాబట్టి రాష్ట్ర ప్రజలందరూ కూడా రేపు రాబోయే స్థానిక లిఎంపిటిసి జడ్పిటిసి సర్పంచు వార్డ్ మెంబర్లను మీరు మన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి మన గ్రామాలను చాలా సుభిక్షంగా దినదినాభివృద్ధి పరంగా మన గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించుకుందామని సమావేశం సందర్భంగా ప్రజలకు తెలియజెయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్నికల మండల ఇన్చార్జి జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి జిల్లా కౌన్సిల్ నెంబర్ ఏవి రెడ్డప్ప మాజీ సర్పంచ్ దామ నాగరాజు దోమ వెంకటేష్ వాసు రెడ్డి కృష్ణారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి సాయినాథ్ రెడ్డి రాజశేఖర్ రఘు కిషోర్ ఈరన్న గౌడ్ గోకారి నర్సింహులు శివప్రసాద్ విజయ్ గౌడ్ నాగరాజు నీల్లిపల్లి దేవాదాసు తిమ్మప్ప మద్దెలబండ శ్రీను గద్వాల్ మరియు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# కులాంతర వివాహాల రక్షణ చట్టం తేవాలి




నాగర్ కర్నూల్ జులై 21 (స్కై న్యూస్): దళితులు కులాంతర వివాహం చేసుకుంటే హత్యలు చేస్తున్నారని కులాంతర వివాహాల చట్టం తీసుకురావాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు జగిత్యాల జిల్లా వెల్కటూర్ మండలం కిషన్రావుపేటలో దళిత యువకుడు మల్లేష్ బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే అమ్మాయి కుటుంబ సభ్యులు అత్యంత దుర్మార్గంగా చంపడం దుర్మార్గమని అన్నారు వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో కులాంతర వివాహం చేసుకున్న వారికి రక్షణ కరువైందని చాలామందిని ఇలాగే చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కులం పోవాలంటే కులాంతర వివాహాలు అవసరమని అంబేద్కర్ తెలియజేశారని కానీ అలా చేసుకున్న వారికి రక్షణ కరువైందని అన్నారు ఇలాంటి దాడులు జరుగుతున్న పోలీసులు ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప దుండగులకు మాత్రం శిక్షలు నామమాత్రంగా పడుతున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు సత్యనారాయణ మండల ఉపాధ్యక్షులు పల్లె రాజు వెంకటయ్య రాములు నరసింహ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు..



జోగులాంబ గద్వాల,జులై21(స్కై న్యూస్): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు సందర్భంగా జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ ఆదేశానుసారం గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గంజిపేట్ శంకర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కటింగ్ చేసి ఖర్గే కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నాయకత్వ విలువలలో నిలకడగా, దశాబ్దాల రాజకీయ అనుభవంతో దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి అని గుర్తు చేశారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

## బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు మానుకోవాలి...



**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి.**

నాగర్ కర్నూల్ జులై 21 (స్కైన్యూస్) అధికార పార్టీ నాయకులు తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పిలుచుకుపడ్డారు సోమవారం దాడికి గురై జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లవెల్లి గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రవీందర్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాడి చేయడం శోచనీయమని వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని కేసు నమోదు చేయాలని కోరారు గ్రామ నాయకులతోపాటు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులతోపాటు తిమ్మాజీపేట పాండు కరన్ లాల్ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# 'ఇందిరా మహిళా శక్తి'తో ఆర్థిక ప్రగతి

## షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

## రేపు షాద్ నగర్ కు మంత్రి శ్రీధర్ బాబు రాక

## షాద్ నగర్ నియోజకవర్గంలో 3418 మహిళా సంఘాలు

## మంత్రి ఎమ్మెల్యేల చేతుల మీదుగా రూ. 3 కోట్ల 29 లక్షల చెక్కుల పంపిణీ

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం అంటున్న ఎమ్మెల్యే

**షాద్నగర్ 21(స్కైన్యూస్):**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 3,418 మహిళా సంఘాలకు గాను జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ల చేతుల మీదుగా రూ. 3 కోట్ల 29 లక్షల చెక్కుల పంపిణీ మహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని రోస్ గార్డెన్ లో జరిగే ఈ కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం అవుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల నిర్వహణలో భాగంగా పలు సంఘాలకు రుణాలు, ప్రమాద బీమా చెక్కులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళల ఆర్థిక ప్రగతి కోసం ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలుచేస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలుకేంద్రాలు, పెరటికోళ్ల పెంపకం, డెయిరీ యూనిట్, పిండి గిర్నీ, మూడు సీహెచ్‌సీలు, స్కూల్ యూనిఫామ్ ఇతర స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా భరోసా అందిస్తుందని వెల్లడించారు. షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన, బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంక్, ఇంకా మండల స్థాయిలో అనగా గ్రూపులకు ఎంటర్ప్రైజెస్ తదితర వ్యాపార కేంద్రాలను పెట్టిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 3418 సంఘాలు రుణాలు సకాలంలో చెల్లించడంతో రూ 3.29 కోట్ల వడ్డీ ప్రభుత్వం తిరిగి చెల్లించనుందని అన్నారు. రుణాలు చెల్లించడంలో జిల్లా రాష్ట్రంలో షాద్ నగర్ ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని అన్నారు. ఉచిత బస్సు, విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ అందజేస్తు న్నదని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద అందిస్తున్న ఆర్థికసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాము ఉపాధి పొందుతూ మిగతా వారికి పని కల్పించే స్థాయికి మహిళలు ఎదుగుతున్నారని వివరించారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మహిళా సంఘాలకు ఆర్థిక ప్రగతి లభించే విధంగా చూస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడువేల 3418 సంఘాలకు గాను 3.29 కోట్ల రూపాయలు చెక్కులు రేపు అందజేస్తామని తెలిపారు. కేశంపేట మండలంలో 766 సంఘాలకు గాను 68 లక్షల పైచిలుకు చెక్కులు అందజేస్తామని, అదేవిధంగా కొత్తూరు మండలంలో 345 మహిళా సంఘాలకు గాను 39 లక్షల రూపాయలు, చౌదరిగుడ మండలంలో 46 సంఘాలకు గాను 47 లక్షలు, కొందుర్గు మండలంలో 382 సంఘాల గాను 39.94 లక్షల రూపాయలు, నందిగామ మండలంలో 472 సంఘాలకు గాను 44.55 లక్షల రూపాయలు చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళా సంఘాల సభ్యులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు..

## బోనాల పండుగ శుభాకాంక్షలతో విశ్వభారతి టెక్నో అండ్ ప్లే స్కూల్ ....



**జోగులాంబ గద్వాల,జులై21(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో విశ్వ భారతి టెక్నో అండ్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ త్యాగరాజు ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎంతో గొప్పగా జరుపుకునే బోనాల పండుగను గద్వాలలో విశ్వభారతి టెక్నో అండ్ ప్లే స్కూల్ విద్యార్థులు బోనమెత్తి, పలువేశదారణలు వేసి, శివమెత్తి బహుశవాణి వినిపించారు. పోతురాజు వేషాదరణలో విద్యార్థినులు బోనమెత్తుకొని గద్వాల పట్టణంలో ఊరేగింపుతో అందర్నీ ఆకర్షించుకున్నారు. గద్వాల పట్టణ ప్రజలకు , రాష్ట్రప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలుగు సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి అని ఏఎం రత్నం

**హైదరాబాద్, జూలై 21:**జీవితంలో మొట్టమొదటిసారి సినిమా పరంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశానని హీరో పవన్ కల్యాణ్ అన్నారు. సినిమా కోసం కష్టపడటమే తనకు తెలుసు తప్ప, అందుకోసం పడిన కష్టం గురించి చెప్పుకోవడం తనకు ఇష్టంలేదని చెప్పుకొచ్చారు. హరిహర వీరమల్లు సినిమా ఈ నెల 24న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ప్రెస్ మీట్ లో పవన్ కల్యాణ్ మాట్లాడారు. సినిమా కోసం ఇంత కష్టపడ్డాం అంత కష్టపడ్డాం అని చెప్పాలంటే తనకు మొహమాటంగా ఉంటుందని అన్నారు. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలనేది తనకు తెలియదన్నారు.నిజానికి ఈ రోజు సాయంత్రం హరిహర వీరమల్లు ఆడియో ఫంక్షన్ ఉందని, అయినప్పటికీ ఇప్పుడు ఈ ప్రెస్ మీట్ ఏఎం రత్నం గారి కోసమే పెట్టామని పవన్ వివరించారు. సినిమా బతకాలని చాలా తపన పడే వ్యక్తి, తెలుగు సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి అని ఏఎం రత్నంను కొనియాడారు. ఈ సినిమా కోసం ఆయన ఎంతగానో తపనపడ్డారని తెలిపారు. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడంతో ఈ సినిమా చాలా ఒడిదుడుకులను ఎదుర్కొందని, షూటింగ్ చాలా ఆలస్యమైందని తెలిపారు. అయినా కూడా ఈ సినిమా చేయడానికి ఏఎం రత్నం పడిన తపనే కారణమని పవన్ వివరించారు.ఆయన తపన చూశాక ఈ సినిమాకు తాను ఎంత ఇవ్వగలనో అంత ఇచ్చానని, ఇందులో బెస్ట్ ఫర్మార్మెన్స్ చూపించానని పేర్కొన్నారు. ఖుషి సినిమా నుంచి ఏఎం రత్నంను దగ్గరగా పరిశీలిస్తున్నానని, కరోనా లాక్ డౌన్ సమయంలో సినిమా ఇండస్ట్రీని బతికించేందుకు ఆయన ఎంతగానో తాపత్రయపడ్డారని పవన్ కల్యాణ్ వివరించారు. కాగా, ఈ సినిమా కోసం తాను ఎక్కువగా సమయం ఇవ్వలేనని చెప్పినా కష్టపడి షూటింగ్ పూర్తిచేశారని చిత్ర బృందాన్ని పవన్ కొనియాడారు. క్లైమాక్స్ కోసం ఏకంగా 55 రోజులు షూటింగ్ చేశామని తెలిపారు. తాను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ ఈ ఫైట్ కోసం ఉపయోగపడిందని వివరించారు.

ఎఫ్ డీసి ఛైర్మన్ పదవికి సిఫార్సు

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు' సినిమా ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. పవన్ కెరీర్ లో ఇది తొలి పాన్ ఇండియా సినిమా కావడం గమనార్హం. ఈ చిత్రంలో పవన్ చారిత్రక యోధుడిగా కనిపించనున్నారు. ఈ సినిమాలో పవన్ సరసన నిధి అగర్వాల్ నటించింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించారు. బాబీ డియోల్, సత్యరాజ్, అనుపమ్ ఖేర్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రలు పోషించారు. మరోవైపు ఈ సినిమాను ప్రమోట్ చేసే క్రమంలో పవన్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో తనకు తెలియదని... ఈ ప్రెస్ మీట్ పెట్టడానికి ఏఎం రత్నమే కారణమని చెప్పారు. ప్రాంతీయ సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఏఎం రత్నం అని కితాబునిచ్చారు. ఏపీ ఫిలిం డెవలప్ మెంట్ ఛైర్మన్ గా ఏఎం రత్నంను చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాను ప్రతిపాదించానని సంచలన కీలక విషయాన్ని వెల్లడించారు. కేవలం తన నిర్మాత అనే ఉద్దేశంతోనే తాను ఈ పదవికి ఆయన పేరును ప్రతిపాదించలేదని... ఆయన అందరు హీరోలతో పనిచేశారని చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో ఆయనకు పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ఆయనకు ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తే ఇండస్ట్రీ ఇంకా బాగుంటుందని అన్నారు. తన పరిధిలో ఉన్న అంశం కాబట్టి ఏఎం రత్నం పేరును ప్రతిపాదించానని తెలిపారు.

# విజయం సాధించేందుకు నిబద్ధతతో కృషి చేయాలి...

**బిజెపి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి.**

**నాగర్ కర్నూల్ జులై 21 (స్కైన్యూస్)** రాబోయే స్థానిక ఎన్నికలలో విజయం సాధించేందుకు నాయకులు కార్యకర్తలు నిబద్ధతతో చిత్తశుద్ధితో పనిచేయాలని బిజెపి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు సోమవారం జిల్లా కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి బలోపేతంగా ఉన్న బిజెపి మరింత శక్తివంతంగా ఎన్నికలలో విజయమే లక్ష్యంగా కృషి చేసేందుకు ప్రతి కార్యకర్త ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనను ప్రజలకు వివరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తామే అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి పథకంలో కేంద్ర



ప్రభుత్వం వాటా ఉందని ప్రజలకు వివరించాలని కోరారు ప్రణాళిక క్రమశిక్షణతో పాటు సమిష్టి కృషితో పనిచేస్తేనే విజయం తథ్యమని ఆయన సూచించారు ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల ప్రబారి బొక్క నరసింహారెడ్డి జిల్లా కన్వీనర్



సుధాకర్ రావు మాజీ మంత్రి రాములు మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పార్లమెంటు అభ్యర్థి భరత్ ప్రసాద్ రాష్ట్ర అధికార ప్రతినిధులు దిలీపాచారి సుధాకర్ రెడ్డి సోలంకి శ్రీనివాస్ రాష్ట్ర నాయకులు మంగ్య నాయక్ ఎన్నికల ఇన్చార్జీలు పాల్గొన్నారు

## వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో వసతిగృహాలను ప్రారంభించిన రాజ్ కుమార్ రెడ్డి

**నారాయణపేట జూలై 21 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాతనపల్లి గ్రామంలోని వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన వసతిగృహాలను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి సోమవారం ముఖ్య అతిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డికి, ఫౌండేషన్ సభ్యులకు దేవాలయ నిర్వాహకులు, పురోహితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం దేవాలయ ఆవరణలో హెూమాన్ని చేపట్టారు. దాతల సహకారంతో నిర్మించిన వసతిగృహాలను దేవాలయ నిర్వాహకులు, దాతలతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. రాజ్ కుమార్ రెడ్డిని దేవాలయ నిర్వాహకులు, దాతలు శాలువలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం



భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు బసంత్ రాజ్ పటేల్, కోట్ల్లీ శరణప్ప, బసిరెడ్డి, మోహన్ రెడ్డి, గంగాధర్, పురోహితులు శివకుమార్, శరణయ్య, గణేష్, చెన్ను, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్



రెడ్డి, రాఘవేందర్ గౌడ్, హన్మంతు ముదిరాజ్, చల్లా వెంకటేష్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నందుకుమార్, వై.సంతోష్, నర్సింహ, శ్రీనివాస్, అశోక్, మన్నె గోపాల్, ప్రవీణ్, విజయ్, రాజు, దాతలు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో 18 కిలోల బంగారం చోరీ

**నల్గొండ, జూలై 21:**సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ దోపిడి జరిగింది. స్థానికంగా ఉన్న సాయి సంతోషి జువెల్లర్స్‌లో దుండుగులు చోరీకి పాల్పడ్డారు. ఏకంగా 18 కిలోల బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. దొంగల ముఠా పథకం ప్రకారం ఈ చోరీకి పాల్పడింది. షాపు వెనుక భాగాన్ని లక్ష్యంగా చేసుకుని.. ఒకవైపు గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం గ్యాస్ కట్టర్ సాయంతో లాకర్లు ధ్వంసం చేశారు. అనంతరం షాపులో ఉన్న మ్మెత్తం బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ నేతృత్వంలో దొంగలను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలంలో అణువణువు గాలిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేశారు.తెలంగాణలో ఇటీవల కాలంలో ఇలాంటి భారీ దొంగతనాలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి, ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లో కోహినూర్ జువెల్లర్స్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో భారీ చోరీ జరిగింది. జూబ్లీహిల్స్‌లోని కోహినూర్ జువెల్లర్స్‌లో సుమారు 15 కోట్ల రూపాయల విలువైన వజ్రాభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఇది రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.ఏడాది మార్చిలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసి సుమారు 50 లక్షల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఏప్రిల్ నెలలో వరంగల్ నగరంలో వరుసగా పదుల సంఖ్యలో ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. విలువైన వస్తువులు, నగదు మాయమయ్యాయి. నెల క్రితం ఖమ్మం నగరంలోని ఒక బంగారం షాపులో సుమారు 8 కేజీల బంగారాన్ని దొంగలు అపహరించారు. తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో 18 కేజీల బంగారం అపహరించుకెళ్లారు.

# కొత్తగూడెం ఏరియాలో స్ట్రక్చర్ కమిటీ సమావేశం

**సింగరేణి జూలై 21( స్కై న్యూస్):**సోమవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు గుర్తింపు మరియు ప్రాతినిధ్య సంఘం సభ్యులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు వేరు వేరు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘం యొక్క స్ట్రక్చర్ కమిటీ సభ్యులు అందజేసిన డిమాండ్లను జిఎం కమిటీ సమావేశంలో హాజరైనటువంటి సంబంధిత అధికారులతో చర్చించి వారి డిమాండ్ల యొక్క అమలుకు సాధ్య సాధ్యలను పరిశీలించి ఏరియా పరిధిలో పరిష్కరించదగిన డిమాండ్లను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ తో ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ కమిటీ నందు కొత్తగూడెం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె గట్టయ్య, సత్తుపల్లి ఏరియా ప్రతినిధి సముద్రాల





సుధాకర్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ ఉమాయిన్ పాల్గొన్నారు ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియుసి స్ట్రక్చర్ కమిటీ నందు వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్,బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి. నాగరాజు, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ జి. సీత రామరాజు పాల్గొన్నారు. యాజమాన్య ప్రతినిధులుగా ఎస్ఓటు జిఎం జివి.కోటిరెడ్డి, డిజిఎం(పర్సనల్) జి.వి. మోహన్ రావు, జీకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీ రమేష్, జెవిఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వీ.నరసింహారావు, డిజిఎం (ఐఈడి) ఎన్. యోహాన్, డిజిఎం (ఈ %ఽ% ఎం) ఏరియా వర్క్ షాప్ టి శ్రీకాంత్, ఏరియా స్టోర్స్ ఇంచార్జ్ లక్షణమూర్తి, ఇంచార్జ్ ఆర్.సి. హెచ్.పి ఎస్.కే.కరీముల్లా, డివైఎస్ఈ(సివిల్) అచ్యుతరామయ్య, మెడికల్ సూపర్డెంట్ ఎం.పరశు రాములు, ఏరియా స్టేట్స్ ఆఫీసర్ బి.తౌరియా,డివైపిఎం (పర్సనల్) గోవర్ధన హరీష్, సీనియర్ పిఓలు కె. దేవదాస్, అధికారులు డి కావ్య, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆదిత్య థాకరే, ఫడ్నవిస్ మంతనాలు
## ఊపందుకున్న ఊహాగానాలు



**ముంబై:** మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు కొత్తమీ కాదు. ఠాక్రే సోదరులు కలుస్తారంటూ కొద్దికాలంగా చెలరేగుతున్న ఊహాగానాలు ఇటీవల ఒకే వేదికపై ఉద్ధవ్, రాజ్ ఠాక్రే కలుసుకోవడంతో తెరిపిన పడ్డాయి. అయితే తాజాగా ఉద్ధవ్ ఠాక్రే, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ మళ్లీ కలుస్తారనే ఊహాగానాలకు తెరలేచింది. ఇందుకు బలం చేకూరుస్తూ ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముంబైలోని ఓ హోటల్‌లో కలుసుకున్నట్టు సమాచారం. తొలుత ఆదిత్య ఠాక్రే శనివారం సాయంత్రం బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని సోఫిటెల్ హోటల్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికి హోటల్‌కు ఫడ్నవిస్ వచ్చారు. అక్కడ ఇద్దరు నేతలు 'రహస్య' సమావేశం జరిపినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) మాత్రం ఫడ్నవిస్ హోటల్‌కు వెళ్లడం నిజమేనని, అయితే ఆయన ఆదిత్యను కలుసుకోలేదని తెలిపింది. వేర్వేరు కార్యక్రమాలకు కోసం వారిద్దరూ వచ్చారని, వారిమధ్య ఎలాంటి సమావేశం చోటుచేసుకోలేదని సీఎం కార్యాలయ అధికారి ఒకరు తెలిపారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌తో ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ పొత్తు ఉంది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యూబీటీ) విపక్ష మహా వికాస్ అఘాడిలో భాగంగా శరద్‌పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌తో పొత్తు కలిగి ఉంది. కాగా, శనివారం సాయంత్రం ఆదిత్య ఠాక్రే, ఫడ్నవిస్ సమావేశం కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చని పలువురు శివసేన (యూబీటీ), బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. బీజేపీ, శివసేన (యూబీటీ) తిరిగి చేతులు కలిపితే అది ఆశ్చర్యకరమైన పరిణామం కాదనీ, 2019లోనూ ఈ పరిణామం జరిగిందని ఎన్సీపీ-ఎస్పీ నేత ప్రశాంత్ జగ్‌తప్ తెలిపారు. మహారాష్ట్రలో ఏదైనా జరగవచ్చని, 2019 తర్వాత కూడా అనేక అనూహ్య పరిణామాలను చూశామని చెప్పారు. రెండు పార్టీలు తిరిగి కలవాలని నిర్ణయిస్తే మహారాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోయేదేమీ ఉండదన్నారు. అయితే, శివసేన (యూబీటీ) వర్గం మహా వికాస్ అఘాడితోనే ఉండొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. లేదంటే ప్రజలను వంచించినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు.

**ఫడ్నవిస్ ఆహ్వానం**

ఈ వారం ప్రారంభంలో శాసన మండలిలో అంబాదాస్ దాన్వే ఫేర్‌వెల్ సందర్భంగా దేవేంద్ర ఫడ్నవిస్ సైతం ఉద్ధవ్ తమ వైపు వస్తే స్వాగతిస్తామని అన్నారు. 2029 వరకూ తాము అక్కడకు (విపక్షం వైపు) వెళ్లే అవకాశం లేదని, ఉద్ధవ్ ఈవైపు (అధికార పక్షం) వచ్చే విషయం ఆలోచించుకోవచ్చని అన్నారు.

## నేను డీకే పేరు చెప్పాలా?
## మీరు నాకు సూచిస్తారా?



కర్ణాటక సీఎం మార్పు అంశంపై గత కొన్ని రోజులుగా జోరుగా చర్చ నడుస్తోంది. సీఎం సిద్ధరామయ్యను మార్చే అవకాశం ఉందని, ఆ స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించడానికి రంగం సిద్ధమైందంటూ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. అయితే దీనిపై సిద్ధరామయ్య కానీ, డీకే శివ కుమార్ కానీ ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటన చేయలేదు. అయితే నిన్న (శనివారం, జూలై 19వ తేదీన) మైసూర్ జిల్లాలో జరిగిన పార్టీ ఈవెంట్‌లో ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తిని సీఎం సిద్ధరామయ్య బహిరంగంగానే వెళ్లగక్కారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ పేరును పేర్కొనాలనే సూచనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను కీర్తించే క్రమంలో కొత్త ప్రాజెక్టులను ప్రకటించడంలో భాగంగా ఏర్పాటు చేసిన 'సాధన సమావేశం'లో సీఎం సిద్ధరామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు,. అయితే అత్యవసరంగా ఆయన బెంగళూరు బయల్దేరాల్సి ఉండటంతో వేదిక పైనుంచి ఉన్నపళంగా వెళ్లిపోయారు. అయితే సిద్ధరామయ్య ప్రసంగానికి సిద్ధమైన క్రమంలో పార్టీ ముఖ్యులను పరిచయం చేసే క్రమంలో డీకే పేరు ప్రస్తావించలేదు. అయితే డీకే, డీకే, డీకే అంటూ సభకు వచ్చిన జనం నుంచి స్పందన వచ్చింది. దీనిపై సిద్ధరామయ్యలో కోపం కట్టలు తెంచుకుంది. అదే సమయంలో డీకే పేరును మరిచిపోయారనే ఉద్దేశంతో కాంగ్రెస్‌కు చెందిన ఒక న్యాయవాది.. ఆ విషయాన్ని ఆయనకు తెలియజేసే ప్రయత్నం చేశారు. దీంతో సిద్ధరామయ్యకు కోపం మరింత ఎక్కువైంది. ' డీకే శివకుమార్ ఇక్కడ లేరు.. అవునా.. కాదా.. దయచేసి మీరు వెళ్లి కూర్చోండి. మీరు ఏ తరహా న్యాయవాది' అంటూ కాస్త స్వరం పెంచి మరీ సిద్ధరామయ్య అనడంతో ఇది పార్టీలోని, ప్రభుత్వంలో అంతర్గత లుకలుకల్ని బయటపెట్టింది.

## పార్టీ కన్నా దేశమే ముఖ్యం'

తిరువనంతపురం: 'నేను భారతదేశం గురించి మాట్లాడేటప్పుడు, మా పార్టీని ఇష్టపడే వారి కోసమే కాకుండా, భారతీయులందరి కోసం మాట్లాడతాను. ఎవరైనా సరే పార్టీ ప్రయోజనాల కన్నా దేశానికే ప్రాధాన్యత ఇవ్వాలని' కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ పిలుపునిచ్చారు. ఇందుకు ఉదాహరణగా దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, 'భారతదేశమే నశించిపోతే ఇక ఎవరు బతుకుతారు?' అని ప్రశ్నించారు. జాతీయ ఐక్యత అనేది రాజకీయ వైరాన్ని అధిగమించాలని థరూర్ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, కాంగ్రెస్ చేపడుతున్న దౌత్యపరమైన ప్రచారం, జాతీయవాద వైఖరిపై వస్తున్న విమర్శల నేపథ్యంలో శశి థరూర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ 'దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు విభేదాలను పక్కన పెట్టి, భారతదేశం కోసం పనిచేయాలి. అప్పుడే మనమంతా శాంతియుతంగా జీవించగలం. నా దృష్టిలో దేశానికే ?తొలి ప్రాధాన్యత.. పార్టీలన్నీ దేశాన్ని మెరుగుపరచడానికి గల సాధనాలు. ఏ పార్టీకి చెందినవారైనా, ఆ పార్టీకి అనుగుణమైన మార్గంలో నడుచుకుంటూ మెరుగైన భారతదేశాన్ని రూపొందించేందుకు కృషిచేయాలి' అని అన్నారు. శశిథరూర్ తనపై వచ్చిన విమర్శలను తిప్పికొడుతూ ఈ విధమైన వ్యాఖ్యానాలు చేశారు. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాక్ ఉగ్రవాద సంబంధాలు, భారత వైఖరిని అమెరికా వంటి దేశాలకు తెలియజేసేందుకు ఏర్పాటైన అఖిలపక్ష ప్రతినిధి బృందానికి శశిథరూర్ నాయకత్వం వహించారు. ఈ సమయంలో ఆయన ప్రసంగాలపై పలు విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పరోక్షంగా థరూర్‌ను లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ పార్టీ దేశానికే ప్రాధాన్యతనిస్తుందని, అయితే కొందరు ముందు ప్రధాని మోదీ, తరువాత దేశం అనే విధంగా వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు.

# తప్పుడు ప్రచారం తగదు



**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై పాశ్చాత్య మీడియా కథనాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తప్పుపట్టారు. విమాన ప్రమాదంపై తుది నివేదిక రాకుండానే వ్యాఖ్యలు చేయడం మంచి పని కాదని సూచించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో హిండాన్ ఎయిర్‌పోర్ట్ నుంచి తొమ్మిది సిటీలకు ఇండిగో విమాన సర్వీసులను మంత్రి ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. 'ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఇప్పటికే పాశ్చాత్య మీడియా సంస్థలకు ఏఏఐబీ విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ స్వప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. ఏఏఐబీపై నాకు నమ్మకం ఉంది. బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని డీకోడ్ చేయడంలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) అసాధారణ ప్రతిభ చూపించింది. దర్యాప్తుపై తుది నివేదిక రాకుండా ఎవరూ ఎలాంటి నిర్ధారణకు రావద్దు' అని మంత్రి పునరుద్ఘాటించారు. జూన్ 12న జరిగిన ఘోర దుర్ఘటనపై పైలట్ల తప్పదమే ముఖ్య కారణమన్న విధంగా వెస్ట్రన్ మీడియా కథనాలు వెలువరించింది. రెండు ఇంజన్లకూ వెళ్లే ఇంధనాన్ని కంట్రోల్ చేసే స్విచ్‌లను కెప్టెన్ ఆపేసినట్టు ఒక యూఎస్ అధికారిని ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించింది. అయితే, ఈ కథనాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తోసిపుచ్చింది. అంతర్జాతీయ మీడియాకు చెందిన కొందరు ఎలాంటి నిర్ధారణ లేకుండానే బాధ్యత లేని కథనాలు ప్రచురిస్తున్నారని, దర్యాప్తు కొనసాగుతుండగా ఇలాంటి కథనాలను వ్యాప్తి చేయడం సరికాదని పేర్కొంది. తుది నివేదిక వచ్చేంత వరకూ మీడియా సంస్థలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. బోయింగ్ 787-8 కుప్పకూలిన దుర్ఘటనలో విమానంలోని 241 మందితోపాటు కుప్పకూలిన ప్రదేశంలోని 19మంది మృతిచెందారు. భారతదేశ విమానయాన చరిత్రలోనే ఇది ఘోర దుర్ఘటనగా నిలిచింది.

# మళ్లీ మా నాన్నే సీఎం



**పాట్నా:** త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, తన తండ్రి నితీష్ కుమార్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆయన కుమారుడు నిషాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు నితీష్ ఎంతో చేశారని, ప్రజలు ఎన్డీయేను గెలిపించి మరోసారి ప్రజాసేవ చేసే అవకాశం ఆయన కల్పిస్తారని పాట్నాలో ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ నిషాంత్ చెప్పారు. 'మళ్లీ మా నాన్నగారే సీఎం అవుతారు. ప్రభుత్వాన్ని ఎన్డీయే ఏర్పాటు చేస్తుంది. మేము గట్టి మెజారిటీతో గెలుస్తాం. గత 20 ఏళ్లుగా ఆయన చేసిన సేవలు, పనులకు గుర్తింపుగా మరోసారి నితీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపిస్తారనే నమ్మకం నాకుంది' అని నిశాంత్ తెలిపారు.

**ఈ ఏడాది చివర్లో ఎన్నికలు**

ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందించిన 75 ఏళ్ల నితీష్ కుమార్ మరోసారి అధికారాన్ని ఆశిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ భాగస్వామిగా ఉన్నాయి. ఈసారి నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి గట్టిపోటీని ఎదుర్కొనే అవకాశం ఉంది. తేజస్వి యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్, కాంగ్రెస్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ, వామపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. నితీష్ పాపురాలిటీ తగ్గుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు ఆయన సారథ్యం వహించకపోవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే బీహార్‌లో ఎన్డీయేకు నితీష్ సారథ్యం వహిస్తారని బీజేపీ స్పష్టత ఇచ్చింది. నితీష్ కుమార్ 2013లో ఎన్డీయేను విడిచిపెట్టి తన చిరకాల ప్రత్యర్థి లాలూ ప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపారు. 2017లో ఆర్జేడీని వీడి తిరిగి ఎన్డీయేలోకి వచ్చారు. 2022లో తిరిగి ఎన్డీయేతో తెగతెంపులు చేసుకుని ఆర్జేడీతో కలిసారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మరోసారి ఆయన పీఎం మోదీ క్యాంపులోకి వచ్చిచేరారు.

# 'ఆ టైమ్‌లో కిటికీలు తెరిచే ఉంచొచ్చు'



**న్యూఢిల్లీ:** విమాన ప్రయాణికులకు ఆహ్లాదం కలిగించే వార్త ఇది. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో కిటికీలో నుంచి బయటకు చూడాలనే ప్రయాణికుల ఆశ నెరవేరనున్నది. భారత వైమానిక దళంలోని జాయింట్ యూజర్ ఎయిర్ పోర్ట్‌లలో (జేయూఏఎస్))విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో కిటికీ షేడ్స్‌ను మూసివేసి ఉంచాలనే నిబంధనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ఉపసంహరించుకుంది.అయితే, విమానాశ్రయాలలో గ్రౌండ్ లేదా ఏరియల్ ఫోటోగ్రఫీపై నిషేధం కొనసాగుతుంది. పలు భద్రతా కారణాల దృష్ట్యా గతంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో కిటికీ షేడ్స్‌ను కిందికి ఉంచాలంటూ డీజీసీఏ అన్ని వాణిజ్య, చార్టర్, ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్లకు సూచించింది. ఈ సూచన ముఖ్యంగా ఇండో-పాక్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఎయిర్‌బేస్‌లను ఉద్దేశించి చేశారు. ఇప్పుడు ఈ నియమాన్ని సడలించారు. అయితే ఫోటోలు, వీడియోలు తీయడంపై గల నిషేధం భద్రతా కారణాల దృష్ట్యా అలాగే కొనసాగనుంది. ప్రయాణికులు తమ ప్రయాణంలో ఫోటోలు లేదా వీడియోలు తీయకూడదని డీజీసీఏ కోరింది. భారత వైమానిక దళం సూచనల ప్రకారం, భద్రత దృష్ట్యా ఫోటోగ్రఫీపై నిషేధం చాలా ముఖ్యమైనదని డీజీసీఏ స్పష్టం చేసింది. టేకాఫ్, ల్యాండింగ్ లేదా విమానం రన్‌వేపై ఉన్నప్పుడు ప్రయాణికులను ఫోటోలు లేదా వీడియోలు తీయడానికి అనుమతించరు. ఈ నియమం ముఖ్యంగా జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌లు అని పిలిచే ఐఏఎఫ్ ఎయిర్‌బేస్‌లకు వర్తిస్తుంది. పౌర, సైనిక విమాన కార్యకలాపాలు ఈ విమానాశ్రయాలలో కొనసాగుతాయి. పఠాన్‌కోట్, శ్రీనగర్, ఆగ్రా, బరేలీ, గ్వాలియర్ తదితర ఎయిర్‌బేస్‌లలో ఫోటోగ్రఫీపై నిషేధం వర్తిస్తుంది.

# జస్టిస్ యశ్వంత్ వర్మ తొలగింపునకు ముహూర్తం ఖరారు?



**న్యూఢిల్లీ:** కాలిన నోట్ల కట్టల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు పదవి నుంచి ఉద్వాసన పలికే సమయం ఆసన్నమైంది. రేపటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందే జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసన ద్వారా తొలగించే ప్రక్రియపై 100 మంది పార్లమెంట్ సభ్యులు సంతకాలు పెట్టినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అధికారికంగా ప్రకటించారు.

**ఇంట్లో కాలిన నోట్ల కట్టలు.. విచారణకు సుప్రీం**

ఈ ఏడాది మార్చి నెలలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున కాలిన నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో జస్టిస్ వర్మపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై సుప్రీం కోర్టు త్రిసభ్య కమిటీతో విచారణ చేపట్టింది. ఈ విచారణలో కాలిన నోట్ల కట్టలు జస్టిస్ యశ్వంత్ వర్మవేనన్న సాక్షులు,ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.

**అభిశంసన చర్యలు**

వీటిని పరిగణలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం నియమించిన త్రిసభ్య కమిటీ సైతం జస్టిస్ వర్మను అభిశంసన ద్వారా తొలగించాలని సిఫారసు చేసింది. త్రిసభ్య కమిటీ నిర్ణయాన్ని తప్పుబట్టిన జస్టిస్‌వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కమిటీ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని అత్యున్నత న్యాయ స్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తనపై అభిశంసన చర్యలు ప్రారంభించాలంటూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చేసిన సిఫార్సులను సైతం సవాలు చేశారు.

**త్రిసభ్య కమిటీ రిపోర్టుపై సవాలు**

నోట్ల కట్టల వ్యవహారంలో తన వాదన పూర్తిగా వినకుండానే నివేదిక రూపొందించారని అంతర్గత ఎంక్వైరీ కమిటీ తీరును ఆయన తప్పుపట్టారు. ఈ దర్యాప్తులో లోపాలు ఉన్నాయని స్పష్టం చేశారు. తనకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలు కమిటీకి లభించలేదన్నారు.

**ఏకమైన అధికార,ప్రతి పక్షాలు**

తనను దోషిగా తేల్చాలన్న ముందస్తు వ్యూహంతోనే నివేదిక సిద్ధంగా చేశారని విమర్శించారు. తనపై దర్యాప్తు ప్రక్రియ మొత్తం రాజ్యాంగవిరుద్ధంగా సాగిందని, తన ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదికపై తాను అధికారికంగా స్పందించకముందే దాన్ని మీడియాకు లీక్ చేశానని, తన ప్రతిష్టను దెబ్బతీయాలన్న కుట్ర జరిగిందని జస్టిస్ వర్మ మండిపడ్డారు. అందుకే ఈ నివేదికను రద్దు చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. అయినప్పటికీ జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టేందుకు అధికార,ప్రతి పక్షాలు ఏకమయ్యాయి.

**అభిశంసన తీర్మానం ద్వారా**

భారత రాజ్యాంగం ప్రకారం.. అవినీతి ఆరోపణల ఆధారంగా రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా మాత్రమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని పదవి నుండి తొలగించవచ్చు.అటువంటి ఘటనల్లో అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యుల మద్దతు లేదంటే లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యుల మద్దతు ఉంటేనే ఆమోదిస్తారు. ఈ తీర్మానాన్ని ఆమోదించడానికి సభలోని మూడింట రెండు వంతుల ఎంపీల మద్దతు అవసరం.

**మంత్రి కిరణ్ రిజిజు ఏమన్నారంటే?**

ఇప్పుడు ఇదే పద్ధతిలో జస్టిస్ వర్మ తొలగింపునకు అధికార,ప్రతిపక్ష లోక్ సభ,రాజ్య సభ సభ్యులు సంతకాలు పెట్టారు. న్యాయవ్యవస్థలో అవినీతి అనేది చాలా సున్నితమైన విషయం. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉన్నాయి. వర్షాకాల సమావేశంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై ప్రభుత్వం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్నాం' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు.

**అభిశంసన తీర్మానంలో అనూహ్య పరిణామం**

ఈ అభిశంసన తీర్మానంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం విభేదిస్తుంటాయి. కానీ న్యాయవ్యవస్థలో అవినీతి వంటి సున్నితమైన అంశంపై పార్టీలకు అతీతంగా స్పందించడం, ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలుస్తూ.. 100 మంది ఎంపీలు అభిశంసన తీర్మానంపై సంతకాలు చేయడం, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సహా 35 మంది కాంగ్రెస్ ఎంపీలు సైతం సంతాలు చేసినట్లు సమాచారం.

# తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

## హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

## ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ

**హైదరాబాద్ జూలై 21:**బీతెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య-వాయువ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, యానం మీదుగా సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవరణం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అలాగే, తూర్పు-పశ్చిమ ద్రోణి దక్షిణ కర్నాటక నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని తెలిపింది. ఈ నెల 24 నాటికి ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వివరించింది.ఈ క్రమంలో సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.ఇక ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు పడుతాయని హెచ్చరించింది. బుధవారం మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో



అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గురు, శుక్రవారాల్లో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఖమ్మం జిల్లాల్లో బలమైన ఈదురుగాలతో కూడిన భారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.

# తనపై సొంత పార్టీకి చెందిన వారే దాడికి యత్నించారు

### సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ జూలై 21:**తనపై సొంత పార్టీకి చెందిన వారే దాడికి యత్నించారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బోనాల పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం ఉస్మానియా యూనివర్సిటీ మాణికేశ్వర్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై దాదాపు 20 మంది దాడి చేసేందుకు యత్నించారు. అద్దాలు దించాలంటూ కారును వెంబడించారు. అయితే అప్రమత్తమైన ఆయన గన్‌మెన్‌లు కారును నేరుగా ఓయూ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన పార్టీకి చెందిన వారే దాడికి యత్నించారని చెప్పారు. ఉద్దేశ పూర్వకంగానే చేశారని అనుమానం వ్యక్తం చేశారు.

# శ్రీకాళహస్తిలో ఆడికృత్తిక సందడి

### భక్తిశ్రద్ధలతో కావడి సమర్పించుకుంటున్న బాలుడు



**శ్రీకాళహస్తి జులై 21:** హరో.. హర నామస్మరణలతో శ్రీకాళహస్తి మార్మోగింది. ఆడికృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విజ్ఞానగిరిపై కొలువుదీరిన స్కంధుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజన ప్రవాహంతో ఇక్కడి క్షేత్రంలో సందడి వాతావరణం నెలకొంది. పసుపు వస్త్రాలను ధరించి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి కావళ్లు పట్టుకుని శరవణభవుని నామస్మరణతో కావళ్ల మొక్కు సమర్పించుకున్నారు. ఆదివారం, సోమవారం రెండు రోజులు కృత్తిక నక్షత్రం ఉండటం తో మధ్యాహ్నం నుంచి విజ్ఞానగిరి భక్తజన సంద్రంగా మారింది. భక్తుల మధ్య తొక్కిసలాటలు లేకుండా క్యూలైన్లను పకడ్బందీగా ఏర్పాటు చేశారు. నారద పుష్కరిణిలోను ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆడికృత్తిక సందర్భంగా విజ్ఞానగిరిపై కొలువుదీరిన కుమారస్వామికి విశేష పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం చందనరూపుడై భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. ఆడికృత్తిక సందర్భంగా ఇంద్రవిమానంపై శ్రీ వల్లి దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామిని చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు ఉదయం నుంచి రాత్రి వరకు 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకుని ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు

# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ!

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల:** జిల్లాలో మొత్తం 14 వేల నూతన రేషన్ కార్డుల పంపిణీ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు చంద్రంపేట రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ. అర్హులైన పేదలందరికీ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని అర్హులైన 2610 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 4527 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 21 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు



బియ్యం పంపిణీ అవుతున్నాయని తెలిపారు.

**అన్నిటికి కీలకం:**

రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగ పడుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కోసం కూడా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.జిల్లాలో నూతనంగా 14 వేల లబ్ధిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కే కే. మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రులు



**జయశంకర్ భూపాలపల్లి:** శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.సోమవారం గోరి కొత్తపల్లి మండలంలో నూతనంగా నిర్మితమైన పోలీస్ స్టేషన్‌ను భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు సభలో మంత్రులు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలు, చట్టవ్యవస్థ పటిష్టంగా ఉండేలా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు గోరి కొత్తపల్లిలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇది స్థానిక ప్రజలకు రక్షణకు భాసటగా నిలుస్తుందని తెలిపారు.౦౦

# పార్లమెంట్ తొలిరోజునే సమావేశాల్లో తీవ్ర గందరగోళం..

## ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్

## స్వాతంత్ర్యం తర్వాత ఇలాంటి ఆపరేషన్ జరుగలేదన్న కేంద్రమంత్రి జేపీ నడ్డా

**న్యూ ఢిల్లీ జూలై 21:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజునే సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడి అంశంపై ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, సభా నాయకుడు జేపీ నడ్డా గట్టిగానే సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాద దాడి నిందితులను ఇంకా పట్టించుకోలేదన్నారు.అంశంపై అన్ని పార్టీలు ఐక్యంగా ప్రభుత్వానికి మద్దతు తెలిపాయని, దాడితో పాటు ఆ తర్వాత జరిగిన ఘటనలపై సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా అంగీకరించారని గుర్తు చేశారు. అదే సమయంలో చాలామంది సీనియర్ సైనిక అధికారులు సైతం అనేక విషయాలను వెల్లడించారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో సమాచారం ఇవ్వాలన్నారు.తన మధ్యవర్తిత్వంతోనే కాల్పుల విరమణ ఒప్పందం కురిదిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 24 సార్లు చెప్పారని.. వేరే దేశానికి చెందిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశానికే అవమానకరమన్నారు. అనంతరం జేపీ నడ్డా మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ గురించి సహా ప్రతి అంశంపై చర్చించిస్తామని.. ప్రతి అంశాన్ని సభ టేబుల్‌పై ఉంచుతామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత



ఇప్పటివరకు ప్రధానమంత్రి నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌లో జరిగినట్లుగా ఇలాంటి ఆపరేషన్ జరగలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కోసం సభలో నోటీసు ఇచ్చారని.. ప్రభుత్వం చర్చిస్తుందని.. ప్రతి ప్రశ్నలకు సమాధానం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

# దారి తప్పుతున్న భాష వాదం

భారతదేశం బహుభాషా సంస్కృతికి నిలయం. ప్రతి భాషకు దానిదైన చరిత్ర, సంస్కృతి, అస్తిత్వం ఉన్నాయి. అయితే, కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలో భాషా వివాదాలు, ముఖ్యంగా హిందీని ఇతర భాషలపై రుద్దే ప్రయత్నంపై తలెత్తుతున్న ఆందోళనలు నిత్యకృత్యంగా మారాయి.భాషా వివాదాలు భారతదేశానికి కొత్తేమీ కాదు. అయితే, దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఐక్యత, సమగ్రత అత్యవసరమైన ఈ సమయంలో భాష పేరుతో జరుగుతున్న హింస, విభేదాలు సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఒక భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయడం వల్ల అది సామాజిక అశాంతికి దారితీస్తుంది. భారతదేశంలో భాషా వైవిధ్యాన్ని గౌరవించడం, అన్ని మాతృభాషలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. విద్యార్థులు తమ మాతృభాషలో ప్రాథమిక విద్యను అభ్యసించడం, ఆ తర్వాత ఇతర భాషలను నేర్చుకోవడానికి ప్రోత్సాహం అందించడం సరైన పద్ధతి. హిందీకి దానిదైన ప్రాధాన్యం ఉండవచ్చు. కానీ, అది ఇతర భాషలపై ఆధిపత్యం చెలాయించే ప్రయత్నం చేయకూడదు. అభివృద్ధి అనేది కేవలం ఒక భాష నేర్చుకోవడం వల్ల మాత్రమే రాదు. అది విద్య, నైపుణ్యాలు, ఆర్థిక అవకాశాలు, సామాజిక సమానత్వం, మౌలిక సదుపాయాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దేశంలోనే ధనిక రాష్ట్రమైన మహారాష్ట్రలో ప్రస్తుతం భాష, అస్తిత్వం పేరుతో జరుగుతున్న ఆందోళనలు ఈ సమస్య ఎంత లోతుగా పాతుకుపోయిందో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రంలో భాష పేరుతో హింసాత్మక సంఘటనలు జరుగుతుండడం, మరోవైపు రాజకీయ నాయకుల వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. మహారాష్ట్రలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మరాఠీని రాష్ట్ర భాషగా, ఇంగ్లిష్‌ను రెండో భాషగా, హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో గత ఏప్రిల్ నెల నుంచి ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ నిర్ణయం సమాఖ్య విధానానికి అనుగుణంగానే తీసుకున్నామని మహారాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. నిజానికి, భారత విద్యావ్యవస్థకు ప్రోత్సాహం, క్రమబద్ధీకరణ లక్ష్యాలతో ప్రభుత్వం 1968లో జాతీయ విద్యావిధానాన్నిఅమల్లోకి తెచ్చింది. అవసరాన్ని బట్టి దానిని మార్పులు చేస్తోంది. ప్రస్తుతం ఆందోళనలకు కారణమైన త్రిభాషా విధానాన్ని ఐదేండ్ల కిందటే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీన్ని దశలవారీగా అమలుచేస్తున్నప్పటికీ, ఇది వివాదాస్పదంగా మారి, గతంలోనూ పలు ఆందోళనలకు దారితీసింది. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సివిల్ సొసైటీ గ్రూపులు, భాషాభిమానులు, ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో ప్రధానంగా మాట్లాడే హిందీ భాషను మహారాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడంతో మహారాష్ట్ర సహా చాలా రాష్ట్రాల్లో భాష అన్నది సున్నితమైన అంశంగా మారింది. గత ఏడాది, ఇండియా సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో కన్నడ భాషాభిమానులు ఆందోళనలు నిర్వహించారు. కంపెనీలు, షాపుల పేర్లను కేవలం ఇంగ్లిష్‌లోనే గాకుండా స్థానిక భాషలోనూ రాయాలనేది వారి డిమాండ్. ఈ సంఘటనలు భాషా అస్తిత్వ పోరాటాలు కేవలం మహారాష్ట్రకే పరిమితం కాదని స్పష్టం చేస్తున్నాయి. హిందీకి ప్రోత్సాహంపై అనుమానాలు. భారత్‌లో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ. హిందీని ప్రోత్సహించడానికి కొన్నేండ్లుగా వివిధ ప్రభుత్వాలు పలు చర్యలు చేపట్టాయి. ఇది స్థానిక సంస్కృతిని దెబ్బతీస్తుందనే సందేహాలు వెల్లువెత్తాయి. హిందీ భాషను సమాజంపై బలవంతంగా రుద్దుతున్నారనే ఆరోపణలు రావడానికి అనేక కారణాలున్నాయి. మొదటగా, జాతీయ భాష అనే నినాదం. రాజ్యాంగం ప్రకారం భారతదేశానికి జాతీయ భాష అంటూ ఏదీ లేదు. హిందీ కేవలం అధికార భాష మాత్రమే. అయినప్పటికీ, హిందీని జాతీయ భాషగా ప్రచారం చేయాలనే తపన హిందీయేతర రాష్ట్రాలలో ఆందోళన కలిగిస్తోంది. 'ఒకే దేశం – ఒకే భాష'. ప్రభుత్వ విధానాలు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, రైల్వేలు వంటి వాటిలో హిందీ వినియోగాన్ని పెంచడం, హిందీలో శిక్షణను తప్పనిసరి చేయడం, ఉద్యోగాలలో హిందీ పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు హిందీయేతర ప్రజలకు అసమానతలకు దారితీస్తాయని భావిస్తున్నారు. మూడోది, రాజకీయ ప్రకటనలు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తరహా ఆందోళనలు పెరిగాయి. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని బీజేపీకి చెందిన నాయకులు తరచుగా హిందీకి ప్రాధాన్యాన్ని ఇస్తూ చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. 'ఒకే దేశం – ఒకే భాష' అనే నినాదం భారతదేశ వైవిధ్యాన్ని విస్మరిస్తుందనే విమర్శ ఉంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాషను 'పెద్దమ్మ భాష'గా అభివర్ణించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని కారణాలు ఉండవచ్చు. జాతీయ సమగ్రత దృక్పథం దీని వెనుక ఒక కారణం. భారతదేశంలో ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే భాష హిందీ కాబట్టి, దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం హిందీ అవసరమని ఆయన భావించి ఉండవచ్చు. 'పెద్దమ్మ భాష'అనే పదం భాషకు ఒక గౌరవాన్ని ఆపాదించాలనే ప్రయత్నంగా కనిపించినప్పటికీ, అది ఇతర మాతృభాషల ప్రాముఖ్యాన్ని తగ్గించి చూసేవిధంగా ఉంది. మరాఠీ మాట్లాడనివారిపై దాడులు. ఏప్రిల్ నెలలో థానే జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలపై మరాఠీలోనే మాట్లాడాలని పట్టుబట్టిన వ్యక్తి దాడికి పాల్పడటం, ముంబయిలో ఒక సెక్యూరిటీ గార్డుకు మరాఠీ తెలియదన్నందుకు స్థానిక ప్రతిపక్ష పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు కొట్టారని ఆరోపించడం, మే నెలలో ఓ డెలివరీ ఏజెంట్ మరాఠీలో మాట్లాడలేదని ముంబయిలో ఓ జంట డబ్బులు చెల్లించడానికి నిరాకరించడం,

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137